



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ






| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 151 | ది.16-9-2026 | బుధవారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 151 | Date : 16-9-2026 | Wednesday | Pages : 8 | Rs.1/- |


# 2027 మార్చి నాటికి 5.52 లక్షల ఇళ్లు

- కేంద్ర సహకారంతో ఇండస్ట్రియల్ టౌన్ షిప్ ల నిర్మాణం
- గృహ నిర్మాణ శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం



**అమరావతి,సెప్టెంబర్ 15 (వార్తాప్రభ) :** రాష్ట్రంలో అర్హులైన ప్రతి కుటుంబానికి 2029 నాటికి సురక్షితమైన, శాశ్వతమైన ఇల్లు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం హౌసింగ్ ఫర్ ఆల్ కార్యక్రమాన్ని సంతృప్తి స్థాయిలో అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. 2027 మార్చి నాటికి 5.52 లక్షల ఇళ్లను పూర్తి చేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు. గృహ నిర్మాణ శాఖపై క్యాంపు కార్యాలయంలో సీఎం సమీక్ష నిర్వహించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్, పీఎం జన్ మన్ సహా వివిధ పథకాల కింద చేపట్టాల్సిన ఇళ్ల నిర్మాణాన్ని వచ్చే నెలలోగా గ్రౌండింగ్ చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. 1.5 లక్షల ఇళ్లను పట్టణ ప్రాంతాల్లోనూ నిర్మాణం చేయాలని సీఎం సూచించారు. డిసెంబరు 2026 నాటికల్లా 2.05 లక్షల ఇళ్లు, 2027 మార్చి నాటికి మరో 2.74 లక్షల ఇళ్లు పూర్తి చేసి గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని సీఎం సూచించారు. పీఎంఏవై 1.0, పీఎంఏవై 2.0, పీఎం జన్ మన్ పథకాల కింద రాష్ట్రంలో 18.72 లక్షల ఇళ్ల మంజూరు కాగా.. ఇప్పటి వరకూ 13.20 లక్షల ఇళ్లు పూర్తి అయ్యాయని అధికారులు వివరించారు. ఏపీ హౌసింగ్ కార్పోరేషన్ పరిధిలో మొత్తం 16.11 లక్షల ఇళ్లకు గానూ ఇప్పటికే 11.31 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి అయిందన్నారు. ఏపీ టిడ్కో పరిధిలో 2.61 లక్షల ఇళ్లకు గానూ 1.88 లక్షల ఇళ్లు పూర్తి అయ్యాయని సీఎంకు వివరించారు. 2027 డిసెంబరు నాటికి 75 వేల కొత్త గృహాలను మంజూరు అయ్యేలా చూడటంతో పాటు 1.5 లక్షల ఇళ్లను పైప్ లైన్ లోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి సూచించారు. దీనికి సంబంధించి కేంద్ర గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధి శాఖలతో సమన్వయం చేసుకుని అవసరమైన కేటాయింపులు పొందాలని సీఎం స్పష్టం చేశారు.

**ఉచిత ఇళ్ల స్థలాలపై ప్రత్యేక కార్యాచరణ..** ఇంటి స్థలాలు లేని కుటుంబాల వాస్తవ డిమాండ్‌ను గుర్తించేందుకు ఆర్టీజీఎస్ సహా ఆవాస్ ప్లస్, హౌసింగ్, రెవెన్యూ శాఖల నుంచి డేటాను అనుసంధానం చేసుకుని డూప్లికేషన్ లేకుండా అర్హులను గుర్తించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో ప్రాథమిక లబ్ధిదారుల జాబితాలను ప్రచురించి అభ్యంతరాలను స్వీకరించి పారదర్శకంగా పరిష్కరించిన అనంతరం తుది జాబితాలను ఖరారు చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇప్పటికే ఉన్న లే అవుట్లలో నిర్మాణాలు చేపట్టని భూమిని అవసరానికి అనుగుణంగా 2 లేదా 3 సెంట్ల ప్లాట్లుగా పునర్వ్యవస్థీకరించాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. ఖాళీ స్థలాల గుర్తింపు, అర్హులైన లబ్ధిదారులకు మ్యాపింగ్, నిర్మాణం పూర్తయ్యే వరకు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సీఎం సూచించారు. కుప్పం నియోజకవర్గంలోనూ సాచురేషన్ విధానంలో గృహ నిర్మాణం చేపట్టాలన్నారు. 2029 నాటికి రాష్ట్రంలో అర్హులైన ప్రతి కుటుంబానికి సురక్షితమైన, శాశ్వతమైన ఇల్లు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. శాఖల మధ్య సమన్వయంతో అందరికీ ఇళ్లు లక్ష్యాన్ని పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు.

# ఘనంగా 69వ కామన్వెల్త్ పార్లమెంటరీ సదస్సు ప్రారంభం

## సదస్సులో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు.





**అమరావతి, సెప్టెంబర్ 15 (వార్తాప్రభ) :** ?దక్షిణాఫ్రికాలోని కేప్‌టౌన్ వేదికగా 69వ కామన్వెల్త్ పార్లమెంటరీ కాన్ఫరెన్స్ ప్రారంభోత్సవ కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. కామన్వెల్త్ దేశాల మధ్య పార్లమెంటరీ విధానాలు, ప్రజాస్వామ్య విలువల బలోపేతం, పరస్పర సహకారం తదితర కీలక అంశాలపై లోతుగా చర్చించేందుకు ఈ అంతర్జాతీయ సదస్సును ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేశారు. ఈ సదస్సుకు భారత ప్రతినిధి బృందం తరపున పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేను రాజు ఈ సమావేశంలో ప్రత్యేకంగా పాల్గొన్నారు. వీరితో పాటు భారత బృందంలో రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్, పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్, దగ్గుబాటి పురంధేశ్వరి తదితరులు ఈ ప్రారంభోత్సవ వేడుకలో పాలుపంచుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల నుంచి విచ్చేసిన ప్రతినిధులతో కలిసి భారత ప్రజాప్రతినిధులు ఈ సదస్సులో చురుగ్గా పాల్గొంటున్నారు.

# రాజకీయ ప్రేరేపిత చర్యలకు కోచింగ్ కేంద్రాలు వేదికలు కావొద్దు

- జీవో నెంబరు 9 మార్గదర్శకాలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు
- ఈ అంశంపై సమీక్ష నిర్వహించి అధికారులకు ఆదేశాలు జారీ చేసిన సీఎం చంద్రబాబు

**అమరావతి,సెప్టెంబర్ 15 (వార్తాప్రభ) :** రాష్ట్రంలోని కొన్ని ప్రైవేటు కోచింగ్ కేంద్రాలు నిబంధనల ఉల్లంఘనకు పాల్పడుతున్నట్టు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. రాజకీయాలకు, రాజకీయ కుట్రలకు ఈ ప్రైవేటు కోచింగ్ కేంద్రాలు వేదిక కాకూడదని ప్రభుత్వం తేల్చి చెప్పింది. ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలతో ఈ అంశంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రభుత్వంపై బురద జల్లేందుకు కొందరు ఈ ప్రైవేటు కోచింగ్ కేంద్రాలపై ఒత్తిడి తెస్తున్నట్టు గుర్తించారు. ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులతో సమీక్ష నిర్వహించారు. నిబంధనలకు వ్యతిరేకంగా కొన్ని కోచింగ్ సెంటర్లు వ్యవహరిస్తున్న తీరుపై తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# మాజీ డిప్యూటీ సీఎం ఆళ్ల నాని మృతి

## ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో విషాదం చోటుచేసుకుంది..



**ఏలూరు,సెప్టెంబర్ 15 (వార్తాప్రభ) :** ఏలూరు మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి, మాజీ డిప్యూటీ సీఎం ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ అలియాస్ ఆళ్ల నాని కన్నుమూశారు. విశాఖపట్నంలో గుండె పోటుతో ఆయన తుదిశ్వాస విడిచారు.ఆళ్ల నాని మృతి వార్తతో ఏలూరు జిల్లాలో విషాద ఛాయలు అలుముకున్నాయి. 2004, 2009లో ఏలూరు ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ తరపున విజయం సాధించిన ఆళ్ల నాని.. అనంతరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.2019 ఎన్నికల్లో ఏలూరు నుంచి విజయం సాధించి.. వైఎస్ జగన్ మంత్రివర్గంలో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అదే సమయంలో డిప్యూటీ సీఎంగా కూడా పనిచేశారు.రాష్ట్ర రాజకీయాల్లో కీలక నేతగా గుర్తింపు పొందిన ఆళ్ల నాని మృతి పట్ల పలువురు రాజకీయ నాయకులు, అభిమానులు, అనుచరులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు.

# తెలంగాణ--ఆగా ఖాన్ అభివృద్ధి సంస్థ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలి

- ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్ తో భేటీలో గవర్నర్ శివప్రతాప్ శుక్లా
- ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్ లోక్ భవన్ ఘన స్వాగతం



**హైదరాబాద్,సెప్టెంబర్ 15 (వార్తాప్రభ) :** తెలంగాణ -- ఆగా ఖాన్ అభివృద్ధి సంస్థ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్‌తో నిర్వహించిన భేటీలో గవర్నర్ శివప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. గవర్నర్ శివప్రతాప్ శుక్లాను ఇస్మాయిలీ ముస్లింల 50వ వారసత్వ ఇమామ్, ఆగా ఖాన్ డెవలప్‌మెంట్ నెట్‌వర్క్ ఛైర్మన్ హిజ్ హైనెస్ ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్ సోమవారం లోక్‌భవన్ కు వచ్చారు. ఇమామ్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం భారత్, తెలంగాణకు ఆయన చేసిన తొలి అధికారిక పర్యటన సందర్భంగా గవర్నర్ ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం లోక్ భవన్ లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. హైదరాబాద్, తెలంగాణకు ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్ రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. దివంగత ఆగా ఖాన్ 4 సేవలను స్మరించుకున్నారు . భారతదేశ అభివృద్ధికి, ఆగా ఖాన్ డెవలప్‌మెంట్ నెట్‌వర్క్ ద్వారా సమాజ సంక్షేమానికి దివంగత ఆగా ఖాన్ 4 అందించిన సేవలను గవర్నర్ కొనియాడారు. 2015లో ఆయనకు పద్మవిభూషణ్ పురస్కారం లభించిందని, దేశ ప్రజలు ఆయనను ఎంతో గౌరవంగా స్మరించుకుంటున్నారని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు ఆగా ఖాన్ ట్రస్ట్ ఫర్ కల్చర్‌తో ఉన్న చిరకాల అనుబంధాన్ని గవర్నర్ ప్రస్తావించారు. 2024 జూలైలో పునరుద్ధరించిన కుతుబ్‌షాహీ సముదాయాన్ని ప్రారంభించేందుకు ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్ హైదరాబాద్‌కు వచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. చారిత్రక కట్టడాల పరిరక్షణ, పరిసరాల అభివృద్ధిలో ఆగా ఖాన్ ట్రస్ట్ ఫర్ కల్చర్ చేపట్టిన కార్యక్రమాలు ప్రభుత్వ--ప్రైవేటు భాగస్వామ్యానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. తెలంగాణలో ఆగా ఖాన్ డెవలప్‌మెంట్ నెట్‌వర్క్ చేపడుతున్న బహుముఖ అభివృద్ధి కార్యక్రమాలను గవర్నర్ ప్రశంసించారు. విద్య, పట్టణ పునరుద్ధరణ, సామాజిక ఆరోగ్య సేవలు, మహిళా సాధికారత, ఉపాధి కల్పన తదితర రంగాల్లో సంస్థ చేస్తున్న కృషి స్థానిక సమాజాలకు దీర్ఘకాలిక ప్రయోజనాలను అందిస్తోందని పేర్కొన్నారు. హైదరాబాద్ సమీపంలోని ఆగా ఖాన్ అకాడమీ ప్రపంచస్థాయి విద్యా ప్రమాణాలతో భవిష్యత్ తరాల నాయకులను తీర్చిదిద్దుతున్న సంస్థగా నిలుస్తోందని అన్నారు. ఆగా ఖాన్ డెవలప్‌మెంట్ నెట్‌వర్క్ సమాజానికి మేలు చేసే శక్తిగా ఉంది. తెలంగాణ--ఏకేడీఎన్ మధ్య సహకారాన్ని మరింత విస్తరించాలి అని గవర్నర్ అన్నారు. తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా మానవాభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలను ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్ ఈ సందర్భంగా వివరించారు. ముఖ్యంగా తెలంగాణలో పట్టణ పునరుద్ధరణ, సామాజిక ఆరోగ్య సంరక్షణ, మహిళల నేతృత్వంలోని అభివృద్ధి, ఉపాధి కల్పన రంగాల్లో ఏకేడీఎన్ చేస్తున్న కృషిని ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్ వివరించారు. ఈ కార్యక్రమాల ద్వారా స్థానిక ప్రజలకు ప్రయోజనాలు అందుతున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ--ఏకేడీఎన్ మధ్య అభివృద్ధి భాగస్వామ్యాన్ని భవిష్యత్తులో మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని ఆయన వ్యక్తం చేశారు.తెలంగాణ--ఏకేడీఎన్ మధ్య చిరకాల అనుబంధం భవిష్యత్తులో మరింత బలోపేతమై సమ్మిళిత, సుస్థిర, ప్రజాకేంద్రిత అభివృద్ధికి దోహదపడుతుందని గవర్నర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# డీఎస్సీపై వైసీపీ ఆరోపణలు నిరాధారం

- ఉద్యోగాల కల్పనను ఓర్వలేకే వైసీపీ దుష్ప్రచారం చేస్తుంది...మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



**అమరావతి,సెప్టెంబర్ 15 (వార్తాప్రభ) :** డీఎస్సీ నియామకాలపై వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. కూటమి ప్రభుత్వం పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా ఉద్యోగ నియామకాలు చేపడుతుంటే వాటిని ఓర్వలేక వైసీపీ నేతలు అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిరుద్యోగ యువతకు జరిగిన అన్యాయాలను ప్రజలు ఇంకా మర్చిపోలేదని మంత్రి అన్నారు. ఐదేళ్లపాటు ఉద్యోగాల భర్తీని నిర్లక్ష్యం చేసిన వారు ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఉద్యోగాలు కల్పిస్తుంటే విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. స్పోర్ట్స్ కోటా నియామకాలపై కూడా నిబంధనల ప్రకారమే అర్హత, ప్రతిభ ఆధారంగా నియామక ప్రక్రియ కొనసాగుతుందని మంత్రి స్పష్టం చేశారు. క్రీడాకారులకు కూటమి ప్రభుత్వం పూర్తి ప్రోత్సాహం అందిస్తోందన్నారు. క్రీడా రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు ప్రతిభ కలిగిన క్రీడాకారులకు తగిన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. డీఎస్సీ పేరుతో నిరుద్యోగ యువతను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను వైసీపీ నేతలు మానుకోవాలని మంత్రి హితవు పలికారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రతి నియామక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఉద్యోగాలు అమ్ముకున్నారని ఆరోపణలు చేస్తున్న వైసీపీ నేతలు ముందుగా తమ ప్రభుత్వ హయాంలో జరిగిన నియామకాలు, అవకతవకలపై ప్రజలకు సమాధానం చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. అధికారం కోల్పోయిన తర్వాత ప్రజలను రెచ్చగొట్టేందుకు నిరాధార ఆరోపణలు చేయడం వైసీపీ నేతలకు పరిపాటిగా మారిందని విమర్శించారు. యువతకు ఉద్యోగాలు రావడం, నిరుద్యోగులకు భరోసా కల్పించడం వైసీపీకి ఇష్టం లేదని, అందుకే కూటమి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి మండిపడ్డారు. చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అభివృద్ధి, ఉద్యోగ కల్పనకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. డీఎస్సీ నియామకాలపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే చట్టబద్ధమైన మార్గాల్లో ఫిర్యాదు చేయాలని, ప్రజలను తప్పుదోవ పట్టించేలా రాజకీయ ఆరోపణలు చేయడం సరికాదని మంత్రి సూచించారు. నిరుద్యోగ యువత ప్రయోజనాలను కాపాడటమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు.

# ధర్మవరం సర్కారు విద్యలో కొత్త ఒరవడి

- విద్యార్థులకు అదనపు తరగతుల నిర్వహణ
- 30 కేంద్రాల్లో 843 మందికి ఉచిత బోధన.. 40 ఉన్నత పాఠశాలల్లో 'విద్యా వాహిని'
- ఆరోగ్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ చొరవతో విస్తృత కార్యక్రమాలు
- సంస్కృతి సేవా సంస్థ ద్వారా చదువుల నుంచి ఉద్యోగాల కల్పన వరకు నిరంతర కృషి



**విజయవాడ,సెప్టెంబర్ 15 (వార్తాప్రభ) :** రాష్ట్రంలో వెనుకబడిన సత్యసాయి జిల్లా ధర్మవరం నియోజకవర్గ ప్రభుత్వ విద్యారంగంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి, స్థానిక శాసన సభ్యుడు సత్యకుమార్ యాదవ్ స్ఫూర్తిదాయక కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అదనపు బోధన, ఉచిత సైకిళ్లు, పరీక్ష ఫీజు చెల్లింపు, మరుగుదొడ్ల నిర్మాణం, తాగునీటి వసతి కల్పించడంతోపాటు యువతకు సివిల్స్ ఉచిత శిక్షణ, ఉద్యోగ అవకాశాలు అందేలా చేయడంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రత్యేకంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల ద్వారా సత్ఫలితాలు కనిపిస్తున్నాయి. తన కుమార్తె పేరుతో నెలకొల్పిన సంస్కృతి సేవా సమితి ద్వారా 15 ఏళ్ల నుంచి విద్యార్థులు, యువతకు అండగా నిలుస్తున్న మంత్రి.. తాజాగా 'విద్యా వికాసం', 'విద్యా వాహిని' కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో, సంస్కృతి సేవా సమితి సహకారంతో 5 మండలాల్లో 30 ఉచిత బోధనా కేంద్రాల ద్వారా 843 మంది విద్యార్థులకు అదనపు బోధన అందుతోంది. మరో 40 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 'విద్యా వాహిని' అమలవుతోంది.

**చదువులో వెనుకబడిన వారికి ప్రత్యేక శ్రద్ధ..** పాఠశాల తర్వాత విద్యార్థులకు అదనపు బోధన అందిస్తూ, ఏ అంశాల్లో వెనుకబడి ఉన్నారో గుర్తించి ప్రత్యేక సహాయం చేస్తున్నారు. ప్రాథమిక విద్యలో పట్టు పెంచడంతోపాటు చదువులో సామర్థ్యాన్ని మెరుగుపరచడంపై దృష్టి సారించారు. ధర్మవరం పట్టణం, ధర్మవరం గ్రామీణం, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాల్లో 30 కేంద్రాలు ఏర్పాటు చేశారు. 30 కేంద్రాలకు 30 మంది స్థానిక బోధకులను ఎంపిక చేశారు. జులైలో ఏర్పాట్లు పూర్తి చేసి ఆగస్టు 10 నుంచి కేంద్రాల్లో బోధన ప్రారంభమైంది. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, మాట్లాడే నైపుణ్యం, సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలను పెంచేలా శిక్షణ ఇస్తున్నారు. వారి ప్రతిభ, ఆసక్తులను గుర్తించి ప్రోత్సహించడంతోపాటు ఉన్నత చదువులు, పోటీ పరీక్షలపై అవగాహన కల్పించనున్నారు.

**40 ఉన్నత పాఠశాలల్లో 'విద్యా వాహిని'..** 'విద్యా వాహిని' ద్వారా 40 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల చదువు, వ్యక్తిత్వ వికాసానికి అవసరమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల హాజరు, చదువులో పురోగతిని పరిశీలిస్తూ అవసరమైన సహాయం అందించనున్నారు.

**2 వేల మందికి ఉచిత సైకిళ్లు..** సంస్కృతి సేవా సమితి ద్వారా ధర్మవరం నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న సుమారు 2 వేల మంది విద్యార్థులకు ఉచితంగా సైకిళు పంపిణీ చేశారు. ఇందుకోసం సుమారు రూ.98 లక్షలు ఖర్చు చేశారు. 41 ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న 2,087 మంది విద్యార్థుల పరీక్ష ఫీజు రూ.2,60,875 చెల్లించారు. దీంతో పేద విద్యార్థులపై పరీక్ష ఫీజు భారం లేకుండా చేశారు.

**పాఠశాలల్లో వసతుల కల్పన..** ధర్మవరంలోని ఆరు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సౌకర్యం కోసం రూ.35 లక్షలతో మరుగుదొడ్లు నిర్మించారు. పాఠశాలలు, వసతిగృహాల్లో శుద్ధి నీటి కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోతుకుంట బీసీ కాలనీలో గంటకు 2,500 లీటర్లు, కేతిరెడ్డి కాలనీలో గంటకు 1,000 లీటర్ల సామర్థ్యంతో నీటి కేంద్రాలను రూ.20 లక్షలతో ఏర్పాటు చేశారు. మరో ఐదు నీటి యంత్రాలకు రూ.15 లక్షలు వెచ్చించారు.

**యువతకు సివిల్స్, బ్యాంకు పరీక్షల్లో ఉచిత శిక్షణ..** బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల్లో డిగ్రీ పూర్తి చేసిన ప్రతిభావంతులైన సుమారు 25 మందిని ఎంపిక చేసి రెండేళ్ల సివిల్స్ శిక్షణ అందిస్తున్నారు. ఉచిత శిక్షణ, ఇతర ఖర్చులు కలిపి రెండేళ్లకు సుమారు కోటి రూపాయలు వ్యయం చేయనున్నారు. ధర్మవరం నియోజకవర్గంలో నిర్వహించిన మెగా ఉద్యోగ మేళాల ద్వారా వేలాది మంది యువత ఉద్యోగాలు పొందారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థతో కలిసి ఉద్యోగ మేళాలు నిర్వహిస్తున్నారు. ఎంపిక చేసిన 35 మందికి బ్యాంకు పరీక్షలకు కూడా ఉచిత శిక్షణతో పాటు, వసతి సౌకర్యాన్ని కల్పిస్తున్నామని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు

# విస్సన్నపేట కోనేరుకు రక్షకుడైన ఎన్ఆర్ఐ వల్లభనేని గిరిబాబు




**విస్సన్నపేట,సెప్టెంబర్ 15 (వార్తాప్రభ) :** విస్సన్నపేట మండల కేంద్రంలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో స్వచ్ఛ కోనేరుగా తీర్చిదిద్దుతున్న శుభ తరుణంలో ఎన్ఆర్ఐ వల్లభనేని గిరిబాబు కోనేరును సందర్శించినట్లు ఎంపీడీవో సిహెచ్ చిన్నరాట్నాలు తెలియజేశారు. ప్రజలు వాకింగ్ చేసే సమయంలో గేదలు కుక్కలు మేకలు కోనేరు కట్టపై సంచరిస్తూ ఉండటంతో ప్రజలు ప్రశాంతంగా వాకింగ్ చేయలేక ఇబ్బందులు పడుతున్నారని ఎంపీడీవో చెప్పారు. ప్రజలు ఆరోగ్యం కొరకు కోనేరు వాకింగ్ ట్రాకర్ పై పడుతున్న ఇబ్బందులను నివారించేందుకు కోనేరు చుట్టూ ఐరన్ మెస్ రక్షణ వలయంగా ఏర్పాటు చేసేందుకు 3 లక్షల రూపాయలు ఉదారంగా చేయూత అందించేందుకు ముందుకు వచ్చారని ఎంపీడీవో తెలియజేశారు. ఎన్ఆర్ఐ గిరిబాబు స్వచ్ఛందంగా మూడు లక్షల రూపాయలు ప్రకటించడం పట్ల ఎంపీడీవో కృతజ్ఞతలు తెలిపారు.

# ముఖ్యమంత్రిని కలిసిన టిడిపి సీనియర్ లీడర్ నెక్కలపు శ్రీనివాసరావు (ఎన్టీవీ ప్రసాద్)



**విస్సన్నపేట,సెప్టెంబర్ 15 (వార్తాప్రభ) :** తిరువూరు నియోజకవర్గ టిడిపి సీనియర్ లీడర్ శ్రీనివాసరావు నెక్కలపు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంలో ఫ్లవర్ బొకే అందించారు. స్థానిక సంస్థల ఎన్నికలలో సమిష్టి కృషితో సంపూర్ణ విజయం సాధించేందుకు ప్రజా సమస్యల పరిష్కారంలో ముందు ఉంటామన్నారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలు మండల ప్రజా పరిషత్ జడ్పిటిసి ఎన్నికలలో గెలుస్తామన్నారు.

# జాతీయ పోషణ మాసంలో భాగంగా అవగాహన కార్యక్రమం







**చందర్లపాడు, సెప్టెంబర్ 15 (వార్తాప్రభ) :** మన అంగన్వాడీ మన బాధ్యత 9వ జాతీయ పోషణ మాసంలో భాగంగా నందిగామ ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ లక్ష్మీ భార్గవి ఆదేశాల మేరకు చందర్లపాడు మండలం లోని మునగాలపల్లి గ్రామంలోని అంగనవాడి సెంటర్ నందు సూపర్వైజర్ ఇస్రాత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడి సెంటర్ లో పోషణ మాసంలో భాగంగా వైవిధ్యం చిరుధాన్యాలు, ప్రోటీన్ పప్పులు, కూరగాయలు, ఆకుకూరలు, సీజనల్ పండ్లు వాటి ప్రాధాన్యత వాటి వల్ల కలిగే ఉపయోగాలు గురించి వివరించడం జరిగింది . అంగన్వాడి కేంద్రాల్లో బాలింతలకు గర్భిణీ స్త్రీలకు సకాలంలో వారికి అందించాల్సినటువంటి కోడిగుడ్లు, బాల సంజీవని మొదలైనటువంటి ఇస్తున్నారా లేవని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త లు సుందరి, రత్నకుమారి మరియు అంగన్వాడి సెంటర్లు పరిధిలోని తల్లులు గర్భవతులు బాలింతలు పాల్గొన్నారు.

# కులమత రాజకీయాలకతీతం మేం గమనాధుని భక్తులం



**విస్సన్నపేట,సెప్టెంబర్ 15 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో నూజివీడు రోడ్డులో వినాయక చవితి సందర్భంగా బశీకు సెంటర్ లో వినాయక నవరాత్రి మండపాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. కులమత రాజకీయాలకు అతీతంగా వినాయక చవితి వేడుకలు జరుపుతామని నిర్వాహకులు తెలియజేశారు.

# పర్యావరణ హిత విగ్రహారాధన అభినందనీయం: మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి

- కాకినాడలో 18 అడుగుల దివ్య 'పంచ చూర్ణ గణపతి' వైభవం



**కాకినాడ,సెప్టెంబర్ 15 (వార్తాప్రభ) :** కాకినాడ నగరం దేవాలయం వీధిని ఆనుకుని ఉన్న దిగుమర్తి వారి వీధిలోని శ్రీశ్రీశ్రీ లక్ష్మీగణపతి ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించిన 18 అడుగుల భారీ 'పంచ చూర్ణ గణపతి' ప్రస్తుతం భక్తులకు కనువిందు చేస్తుంది. నిత్య పూజల్లో ఉపయోగించే పరమ పవిత్రమైన సుమారు 250 కిలోల పసుపు,కుంకుమ, సుగంధ భరిత గంధం,విభూతి, కుబేర కుంకుమలను మేళవించి ఈ మహాగణపతి దివ్య మంగళ రూపాన్ని తీర్చిదిద్దారు. ?ఈ మహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, మహాలక్ష్మి దంపతులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు అందుకున్నారు. నవరాత్రుల సందర్భంగా గణపతి హోమం, చండీ హోమం, కుంకుమ పూజలు, సరస్వతీ పూజలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 23న గణపతి నిమజ్జనం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ కుడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి కుమార్ మాట్లాడుతూ, "ప్రకృతి ప్రసాదించిన సహజ సిద్ధమైన వస్తువులతో విఘ్నేశ్వరుడిని ఆరాధించడం మన సనాతన ధర్మంలోని విశిష్టత. పర్యావరణ హిత విగ్రహాల ఆరాధన సమాజానికి ఎంతో ఆదర్శం" అని పేర్కొన్నారు. భక్తుల కోసం ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు విద్యార్థుల కోసం సరస్వతి పూజ మహిళల కోసం కుంకుమ పూజలతో పాటు శ్రీ గణపతి హోమం చండీ హోమం తదితర విశేష పూజా కార్యక్రమాలు జరుగుతాయి అన్నారు అనంతరం సెప్టెంబర్ 23వ తేదీన ఘనంగా నిమజ్జనోత్సవం నిర్వహించినట్లు వెల్లడించారు. ప్రతి ఒక్కరు ఆయురారోగ్యాల తో అష్టైశ్వర్యాలతో తులతూగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ సుంకర శివ ప్రసన్న సాగర్, మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి, మాజీ కార్పొరేటర్ సుజాత సాయి నిర్వాహకులు, రాగిరెడ్డి అరుణ్ కుమార్, రఫీ,జిల్లా సోషల్ మీడియా అధ్యక్షుడు మీసాల నికేష్, కార్పొరేటర్ బొర్రా రమణ, గుడి కమిటీ తుమ్మలపల్లి సురేష్, వేమూరి రాము, యనమదల భద్రం, పొన్నగంటి,ఆలయ కమిటీ సభ్యులు వైసీపీ నాయకులు, అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

# ఘనంగా లయన్స్ ఇంజనీర్స్ డే వేడుకలు





**విస్సన్నపేట,సెప్టెంబర్ 15 (వార్తాప్రభ) :** లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డే (ఇంజనీర్ల దినోత్సవం) వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. భారత రత్న ఎం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని సంబరాలు జరిపారు. ఈ వేడుకలలో పలువురు ప్రముఖులు, ఇంజనీరింగ్ నిపుణులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ?ఎం. విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి, దేశానికి ఆయన అందించిన సేవలను, సాగునీటి ప్రాజెక్టులు మరియు ఇంజనీరింగ్ రంగంలో ఆయన చేసిన విశేష సేవలను వక్తలు కొనియాడారు. ?నేటి యువ ఇంజనీర్లు విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకుని, నూతన సాంకేతికతను ఆవిష్కరిస్తూ సమాజ అభివృద్ధికి పాటుపడాలని లయన్స్ క్లబ్ ప్రతినిధులు పిలుపునిచ్చారు. ?ప్రతిభావంతుల సత్కారం: ఈ సందర్భంగా వివిధ రంగాలలో రాణిస్తున్న ప్రతిభావంతులైన ఇంజనీర్లు విశిష్ట అతిథి లయన్ విల్సన్ బాబు ,లయన్ మేడ శ్రీనివాసరావు, ఏబి రాజేంద్రప్రసాద్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అమరావతి, కే లోకేష్ దత్ ఏ ఈ తిరువూరు మున్సిపాలిటీ, జి రాజు ఏఈ ఆగిరిపల్లి తదితరులను లయన్స్ క్లబ్ నిర్వాహకులు పట్టు శాలువాతో సుగంధ పరిమళాలు వెదజల్లే పూలదండలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి డాక్టర్ లయన్ ఎన్టి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సమాజంలో ఎవరు ఏ వృత్తిలో ఉన్న విధి నిర్వహణతో పాటు సేవే లక్ష్యంగా ముందుకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ అధ్యక్షులు ఎం శ్రీనివాసరావు కార్యదర్శి సిజెడబ్ల్యూకే బాబు జోన్ చైర్మన్ డాక్టర్ కిరణ్ వీర్ల తదితరులు సన్మానించిన వారిలో ఉన్నారు. సేవా కార్యక్రమాలలో భాగంగా కోనేరు అభివృద్ధి పనులలో తమ వంతు భాగమవుతామని డాక్టర్ ఎన్టీ వెంకటేశ్వరావు తెలియజేశారు. కోనేరు పనులు నిర్వహణ కార్యక్రమంలో ఎంపీడీవో సిహెచ్ చిన్న రాట్నాలు, ఈవో హరికృష్ణ కుమార్, లలిత సూపర్ బజార్ పార్ట్నర్ స్వచ్ఛ కోనేరు చెరువు కాంట్రాక్టర్ కె రామకృష్ణ విశ్రాంత ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ ముంగా జయరాజు, లయన్ వెంకటరెడ్డి, సూరి రాజు మాస్టారు డి ఎస్ ఆర్, సునీల్ సితారెడ్డి రవి మోహన్ జగన్మోహన్ రెడ్డి జె రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# సిపిఎం, ప్రజా సంఘాల నాయకుల ముందస్తు అరెస్టులను ఖండించండి

- భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను కాలరాస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- పోలీసు రిక్రూట్మెంట్ పోస్టుల సంఖ్య పెంచి నోటిఫికేషన్ విడుదల చేయాలని సిపిఎం డిమాండ్





**కాకినాడ,సెప్టెంబర్ 15 (వార్తాప్రభ) :** సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తల హౌస్ అరెస్టులను ప్రజాస్వామ్య వాదులంతా ఖండించాలని సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు ఒక ప్రకటనలో కోరారు. మంగళవారం ఉదయం సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు ఇంటి వద్దకు ఇంద్రపాలెం పోలీసు వారు వచ్చి బయటకు వెళ్ళడానికి వీల్లేదని, ఉన్నతాధికారులు ఆదేశాలు ఉన్నాయని తెలిపారు. దీనిపై పలివెల వీరబాబు రూరల్ సిఐ, ఇంద్రపాలెం ఎస్ఐ లను వివరణ కోరగా పోలీసు అభ్యర్థులు ఈరోజు సాయంత్రం క్రొవ్వొత్తుల ర్యాలీ ఉందని సమాచారం నేపథ్యంలో హౌస్ అరెస్టు చేస్తున్నట్లు తెలిపారన్నారు. అదేవిధంగా ఎస్ఎఫ్ఐ నాయకుడు ఎం.జి. సూరిబాబు తో పాటు ఆదర్శ కార్తీక్ అనే యువకుడిని కూడా కలెక్టర్ కార్యాలయం వద్ద అరెస్టు చేసి 1 వ పట్టణ పోలీసు స్టేషన్ కు తరలించినట్లు తెలుస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశ చర్యలను ప్రజాస్వామ్య వాదులంతా ఖండించాలని కోరుతున్నామన్నారు. సామాన్య, పేద కుటుంబాల యువతీ యువకులు ఎన్నో ఆశలతో, ఆకాంక్షలతో పోలీసు రిక్రూట్మెంట్ కోసం శిక్షణ పొందుతున్నారని తెలిపారు. పోస్టుల సంఖ్య తగ్గించడం వల్ల కొంత మంది అభ్యర్థులు వయోపరిమితి దాటిపోతూ ఉండడం వల్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. పోలీసు రిక్రూట్మెంట్ పోస్టుల సంఖ్య పెంచాలని నిరుద్యోగ అభ్యర్థుల డిమాండ్ లో న్యాయం ఉందన్నారు. మరొక ప్రక్క స్టేషన్ లలో సరిపడా పోలీసు లేక ఉన్న సిబ్బంది పై పనిభారం పెరుగుతుందన్నారు. ఉద్యమాలను, నిరసనలు అణచడానికి పోలిసులను ఉపయోగించడం మాని, గంజాయి, మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు అరికట్టడానికి ఉపయోగిస్తే బావుంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు, నిరుద్యోగ అభ్యర్థులపై రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ చర్యలను మానుకోవాలని లేనిపక్షంలో మరొక ఉద్యమం తప్పదన్నారు. అదేవిధంగా పోలీసు రిక్రూట్మెంట్ పోస్టుల సంఖ్య పెంచి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామని వీరబాబు ఒక ప్రకటనలో తెలిపారు.

# వినాయక చవితి సందర్భంగా అన్నవరం శ్రీ సత్యనారాయణ స్వామివారిని దర్శించుకున్న డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి బాబు



**అన్నవరం,సెప్టెంబర్ 15 (వార్తాప్రభ) :** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు,డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి బాబు, పెద్దాపురం పట్టణ జనసేన పార్టీ నాయకులతో కలిసి కాకినాడ జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన రత్నగిరి కొండపై కొలువై ఉన్న అన్నవరం వీర వెంకట సత్యనారాయణ స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా అభివృద్ధి చెందాలని ప్రార్థించారు. వినాయక చవితి వంటి పవిత్ర పర్వదినాల్లో కుటుంబ సమేతంగా దేవాలయాలను దర్శించుకోవడం ద్వారా ఆధ్యాత్మిక ప్రశాంతతతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తుమ్మల రామస్వామి బాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం పట్టణ జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేదలకు జీవనోపాధిని ఇస్తున్న మెయిల్ క్రిష్ణారెడ్డి...

**గుడ్లవల్లేరు,సెప్టెంబర్ 15 (వార్తాప్రభ) :** పేదలకు మెయిల్ అధినేత పురిటిపాటి వేడుకట క్రిష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతుల సహకారంతో జీవనోపాధిని అందిస్తున్నారన పీ4 మేనేజర్ బి.చింతయ్య, రఘురాం తెలిపారు. మండలంలోని వడ్లమన్నాడు గ్రామంలో జీవనోపాధి అభివృద్ధిలో భాగంగా కొత్తపల్లి రజినికి టిఫిన్ హోటల్ యూనిట్ ఏర్పాటు చేశారు. మెయిల్ సంస్థ పీ4 ప్రాజెక్ట్ లో భాగంగా రూ.47,500 ఆర్థిక సహాయాన్ని అందించి ఏపీ ఎంఎస్ ద్వారా ఈ జీవనోపాధి యూనిట్ను ఏర్పాటు చేసి ప్రారంభించారు. గుడ్లవల్లేరు మండల టీడీపీ ఉపాధ్యక్షులు పెన్నేరు రమేష్ బాబు, వడ్లమన్నాడు గ్రామ టీడీపీ అధ్యక్షులు పామర్తి సత్తిబాబు, వడ్లమన్నాడు గ్రామ మాజీ ఉపాధ్యక్షులు గరికిపాటి రాంబాబు, బంగారు మిత్ర పుల్లేటి సాయి ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

# వి ఆర్ ఓ గుండెపోటుతో మృతి...



**గుడ్లవల్లేరు,సెప్టెంబర్ 15 (వార్తాప్రభ) :** మండలంలోని వడ్లమన్నాడుకు చెందిన కట్ట వీరబాబు పెడన మండలంలోని ఉరిమి వీఆర్వోగా పని చేస్తున్నారు. ఆయనకు సోమవారం రాత్రి గుండెనొప్పి వచ్చేసరికి హాస్పటల్ కు తరలించారు. మార్గమధ్యంలోనే ఆయన తుది శ్వాస విడిచారు. మంగళవారం ఆయనకు అంతిమ సంస్కారాలు చేశారు.

# తిరువూరులో ఘనంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు



**తిరువూరు,సెప్టెంబర్ 15 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. జయకృష్ణ హాస్పిటల్ అధినేత డాక్టర్ పెనుమల్లి నాగేశ్వరరావు గారి ఆధ్వర్యంలో, వారి సొంత హాస్పిటల్ ఆవరణలో గణేష్ నవరాత్రుల 2 రోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గురు స్వామి మూర్తి స్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజా కార్యక్రమంలో డాక్టర్ పెనుమల్లి నాగేశ్వరరావు గారు, గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు, హాస్పిటల్ సిబ్బంది, స్థానికులు పాల్గొని గణనాథుడి ఆశీస్సులు పొందారు. భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ కార్యక్రమంతో హాస్పిటల్ ఆవరణలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

# రవిరామ్ ప్రైవేట్ లిమిటెడ్ వేదికగా వైభవంగా శ్రీ గణపతి నవరాత్రులు ప్రారంభం







**విజయవాడ,సెప్టెంబర్ 15 (వార్తాప్రభ) :** నగరంలోని గాంధీనగర్ న్యూఇండియా హోటల్ సెంటర్,ఐలాపురం హోటల్ ఎదురుగా ఉన్నరవిరామ్ ప్రైవేట్ లిమిటెడ్ వేదికగా శ్రీగణపతి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా, ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితి,విశ్వహిందూపరిషత్, మా ఆర్ట్స్, మా మిత్ర మండలి సంయుక్త ఆధ్వర్యంలో పది రోజుల పాటు ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని చాటుతూ పూర్తిగా మట్టితో తయారు చేసిన శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి ప్రతిమను ప్రతిష్ఠించారు. ఉత్సవాల తొలిరోజు ఉదయం 9.15 గంటలకు గోపూజతో పాటు శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు గకార గణపతి సహస్రనామ అర్చనను విశేషంగా చేపట్టారు. గౌరవ అధ్యక్షులు చింతలరామారావు(చంటి) పర్యవేక్షణలో నిర్వహిస్తున్న ఈ నవరాత్రి ఉత్సవాల్లో ప్రతి రోజూ గోపూజ, నిత్యార్చన, తీర్థప్రసాద గోష్టితో పాటు వివిధ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు, హోమాలు, అమ్మవారికుంకుమార్చనలు నిర్వహించనున్నారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోని పలు గణపతి మండపాలను ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితి గౌరవ అధ్యక్షులు చింతల రవికుమార్ (చంటి), మా మిత్ర మండలి చింతల రామారావు (బాబీ)తో కలిసి గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులతో కలిసి స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ భక్తిశ్రద్ధలతో గణపతి మహోత్సవాలను నిర్వహించడం సంతోషకరమైన విషయమన్నారు. ముఖ్యంగా పది రోజుల పాటు భక్తులకు అన్నదానం, వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మా ఆర్ట్స్ చంటి, మా మిత్ర మండలి బాబీతో పాటు ఉత్సవ కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. భక్తి కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా సమాజంలో స్ఫూర్తిదాయకమైన వాతావరణం ఏర్పడుతుందని అన్నారు. వినాయక చవితి వేడుకల్లో చిన్నారులు, యువత, మహిళలు, వృద్ధులు అనే తేడా లేకుండా అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములు కావడం మన సంప్రదాయాల గొప్పతనానికి నిదర్శనమన్నారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని మట్టి వినాయక ప్రతిమను ప్రతిష్ఠించడం అభినందనీయమని పేర్కొన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని గణనాథుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి పూజా కార్యక్రమాల్లో మాజీ పార్లమెంట్ సభ్యులు గోకరాజు గంగరాజు, జనసేన నాయకులు అమ్మిశెట్టి వాసు, కాంగ్రెస్ నాయకులు ఆకుల శ్రీనివాసు, ప్రముఖ పారిశ్రామికవేత్త కోగంటి సత్యం, ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షులు చలసాని ఆంజనేయులు దంపతులు, విజయవాడ మహానగర్ గణేష్ ఉత్సవ సమితి గౌరవ అధ్యక్షులు చింతల రవికుమార్ చంటి దంపతులు, మా మిత్ర మండలి చింతల రామారావు బాబీ, 31వ డివిజన్ టీడీపీ ఉపాధ్యక్షులు అడబాల కృష్ణాజి దంపతులు, నాగుల్ మీరా, మాజీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, బండి పుణ్యశీల, శ్యాం ప్రసాద్, యలకల చలపతిరావు, లాకా వెంగళరావు యాదవ్, కాపు జేఏసీ అధ్యక్షులు చందు జనార్ధన్, ఏపీ గణేష్ ఉత్సవ సమితి ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు ఎండూరి కిషోర్ దంపతులు, జిల్లా కార్యదర్శి సానా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం ముఖ్య అతిథులను నిర్వాహకులు శాలువాలతో సత్కరించి, గణపతి చిత్రపటంతో పాటు స్వామివారి ప్రసాదాలను అందజేశారు. నగరంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి గణనాథుని దర్శించుకున్నారు. విచ్చేసిన ప్రతి భక్తునికి నిర్వాహకులు ప్రసాదంతో పాటు అన్న వితరణ అందించారు.

# వినాయకుడి పూజలో పాల్గొన్న కూన శ్రీశైలం గౌడ్

**విఘ్నేశ్వరుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన మాజీ ఎమ్మెల్యే ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్ష**



**గాజులరామారం, సెప్టెంబర్ 15, (వార్తాప్రభ) :** గణేష్ చతుర్థి పర్వదినాన్ని పురస్కరించుకుని గాజులరామారం గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడారు. ఆ విఘ్నేశ్వరుడి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు మరియు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం ఉత్సవ కమిటీ ప్రతినిధులు కూన శ్రీశైలం గౌడ్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ పూజా కార్యక్రమంలో స్థానికులు ఇంద్రసేనారెడ్డి, ఇంద్రసేనా గుప్త, బాలరాజు, యాదగిరి, శ్రీరాములు, కూన రాఘవేందర్ గౌడ్, ముత్యపాగా లక్ష్మణ్, సురేష్, నరసింహ రెడ్డి, నరేంద్ర వర్మ, ఎం. సాగర్, కూన నరేష్ గౌడ్, సుజిత్ రెడ్డి, కూన వంశీ గౌడ్, యశ్వంత్ రెడ్డి, మధుసూదన్ రెడ్డిలతో పాటు కాలనీవాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవం గా ప్రకటించాలని తహసిల్దార్ కు వినతి పత్రం అందజేసిన బిజెపి పార్టీ శ్రేణులు.**



**కీసర, సెప్టెంబర్ 15(వార్తా ప్రభ):**సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవంగా ప్రకటించాలని కీసర డివిజన్ అధ్యక్షులు కోల బాలరాజు యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక తహసిల్దార్ యాదిరెడ్డి కి వినతి పత్రం అందించడం జరిగినది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సింగిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జిల్లాల తిరుమల్ రెడ్డి, నాగారం మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిలు బుద్ధవరం లక్ష్మి, గోనే శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి బోడ శ్రీనివాసరావు, శ్యామ్ సుందర్ శర్మ, బిజ్జ శ్రీనివాస్ గౌడ్, మాజీ అధ్యక్షులు దేశం మల్లేష్ గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు మెట్టు కృష్ణ యాదవ్, జిల్లా నాయకులు రాగుల అశోక్ ముదిరాజ్ , ప్రభాకర్ రెడ్డి, జిల్లా కిసాన్ మోర్చ ప్రధాన కార్యదర్శి కొలిచెలిమి కృష్ణ, ఏలూరి సత్యనారాయణ, నాగారం డివిజన్ అధ్యక్షులు నాగరాజు యాదవ్, కీసర డివిజన్ ప్రధాన కార్యదర్శి నల్ల వెంకటరెడ్డి, వెంకటేశ్వర్లు,జంగారెడ్డి,మండల నాయకులు అన్నోజిగూడ మల్లారెడ్డి, తాళ్ళ మల్లేష్, తర్రే కృష్ణ యాదవ్, బోయినీ రాంబాబు, భాస్కర్ ముదిరాజ్, లింగం ముదిరాజ్, నాగరాజు, జిన్నారం వేణు ,మరియు వివిధ డివిజన్ల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ఎంబీబీఎస్ అడ్మిషన్ల కన్వీనర్ కోటా సెకండ్ ఫేజ్ సీట్ల కేటాయింపు

**19వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు కాలేజీల్లో చేరేందుకు గడువు**

**మేనేజ్‌మెంట్ కోటా ఎంబీబీఎస్/బీడీఎస్ ఫస్ట్ ఫేజ్ సీట్ల కేటాయింపు కూడా విడుదల**

**హైదరాబాద్, సెప్టెంబర్ 15:(వార్తా ప్రభ ప్రతినిధి)**2026--27 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్ అడ్మిషన్ల కన్వీనర్ కోటా సెకండ్ ఫేజ్ సీట్ల కేటాయింపును కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ మంగళవారం విడుదల చేసింది. కాలేజీల వారీగా సీట్ల కేటాయింపు వివరాలను యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. కన్వీనర్ కోటా సెకండ్ ఫేజ్‌లో సీట్లు పొందిన విద్యార్థులు సెప్టెంబర్ 19 సాయంత్రం 4 గంటలలోపు తమకు సీట్లు కేటాయించిన కాలేజీల్లో చేరాలి. చేరే సమయంలో ఒరిజినల్ సర్టిఫికెట్లు, బాండ్లు, ఇతర అవసరమైన పత్రాలను సమర్పించాలని యూనివర్సిటీ తెలిపింది. అలాగే, మేనేజ్‌మెంట్ కోటా కింద ఎంబీబీఎస్/బీడీఎస్ సీట్ల ఫస్ట్ ఫేజ్ కేటాయింపులను కూడా యూనివర్సిటీ విడుదల చేసింది. ఈ కేటగిరీలో సీట్లు పొందిన విద్యార్థులు సెప్టెంబర్ 19 సాయంత్రం 6 గంటలలోపు తమకు సీట్లు కేటాయించిన కాలేజీల్లో చేరాలి. అవసరమైన ఒరిజినల్ సర్టిఫికెట్లు, బాండ్లు, ఇతర పత్రాలను సమర్పించి అడ్మిషన్ పూర్తి చేసుకోవాలని యూనివర్సిటీ సూచించింది. మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ షెడ్యూల్ ప్రకారం 2026--27 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్, బీడీఎస్ అకడమిక్ సెషన్ సెప్టెంబర్ 15 నుంచి ప్రారంభమైందని యూనివర్సిటీ తెలిపింది. విద్యార్థులు నిర్ణీత గడువులో తమ అడ్మిషన్లను పూర్తి చేసుకోవాలని సూచించింది.

# ఆకలి తీరే చోటు.. అన్న క్యాంటీన్



**గన్నవరం, సెప్టెంబర్ 15(వార్తాప్రభ)** నియోజకవర్గంలోని పేదలు, కార్మికులు, చిరు వ్యాపారులు, ఉద్యోగుల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్ ప్రారంభానికి సర్వం సిద్ధమైంది. బాయ్స్ హైస్కూల్ గ్రౌండ్ సమీపంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రారంభించనున్నారు. అన్న క్యాంటీన్‌లో కేవలం రూ. 5కే అల్పాహారం అందించడంతో పాటు మధ్యాహ్నం, రాత్రి భోజన సదుపాయం కల్పించనున్నారు. వివిధ పనుల నిమిత్తం గన్నవరం వచ్చే పేద, మధ్యతరగతి ప్రజలు, కార్మికులు, చిరు వ్యాపారులు, ఉద్యోగులకు ఈ క్యాంటీన్ ఎంతో ఉపయోగకరంగా ఉండనుంది. బాయ్స్ హైస్కూల్ గ్రౌండ్ సమీపంలో ఏర్పాటు చేయడంతో ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు.

# సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించాలి

**● డిప్యూటీ తహసీల్దార్‌కు బీజేపీ వినతి ● తెలంగాణ విమోచన చరిత్ర పరిరక్షణకు 'సప్త సంకల్పాలు' అమలు చేయాలని డిమాండ్ ● దుండిగల్ సర్కిల్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేత**



**దుండిగల్, సెప్టెంబర్ 15, (వార్తాప్రభ) :** సెప్టెంబర్ 17ను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా "తెలంగాణ విమోచన దినోత్సవం"గా నిర్వహించాలని, చారిత్రక అంశాలను శాశ్వతంగా పరిరక్షించేందుకు ప్రతిపాదించిన "తెలంగాణ సప్త సంకల్పాల"ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ దుండిగల్ సర్కిల్ ఆధ్వర్యంలో గండిమైసమ్మ దుండిగల్ మండల డిప్యూటీ తహసీల్దార్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ ప్రతినిధులు మాట్లాడారు. 1948 సెప్టెంబర్ 17న నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల అకృత్యాలు, జాగీర్దారీ దోపిడీల నుంచి హైదరాబాద్ సంస్థానానికి విముక్తి లభించి భారత యూనియన్‌లో విలీనమైన చారిత్రక సందర్భమని పేర్కొన్నారు. ఈ పోరాటంలో అసంఖ్యాక రైతులు, మహిళలు, యువకులు ప్రాణాలర్పించారని గుర్తుచేశారు. ఉక్కుమనిషి సర్దార్ వల్లభభాయ్ పటేల్ దృఢ సంకల్పం, భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ పోలో చర్యలతోనే విముక్తి సాధ్యమైందని వివరించారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం, భావితరాలకు చారిత్రక సత్యాలను చేరవేయడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత అని స్పష్టం చేశారు.

**వినతిపత్రంలో పేర్కొన్న తెలంగాణ సప్త సంకల్పాలు** సెప్టెంబర్ 17ను రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలలో ప్రభుత్వం అధికారికంగా విమోచన దినోత్సవంగా నిర్వహించాలి. హైదరాబాద్ నగరంలో సర్దార్ వల్లభభాయ్ పటేల్ భారీ "స్టాట్యూ ఆఫ్ లిబరేషన్" విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి. పోరాట ఘట్టాలు, ఆపరేషన్ పోలో చారిత్రక ఆధారాల భద్రతకు హైదరాబాద్‌లో అంతర్జాతీయ స్థాయి "తెలంగాణ విమోచన మ్యూజియం" నిర్మించాలి. ప్రతి జిల్లా కేంద్రంలో "తెలంగాణ విమోచన స్మృతి కేంద్రం" ఏర్పాటు చేసి స్థానిక వీరుల చరిత్రను పొందుపరచాలి. పాఠశాల, కళాశాల పాఠ్యపుస్తకాల్లో నిజాం వ్యతిరేక పోరాట చరిత్రను చేర్చడంతో పాటు ఉద్యమకారుల అధికారిక జాబితాను రూపొందించాలి. బైరాన్‌పల్లి, పరకాల వంటి ప్రతిఘటన జరిగిన గ్రామాల్లో విమోచన స్మారక స్తూపాలను నిర్మించాలి. చారిత్రక గ్రామాలు, అమరవీరుల స్థలాలు, పోరాట కేంద్రాలను కలుపుతూ "తెలంగాణ విమోచన పర్యాటక సర్క్యూట్" అభివృద్ధి చేయాలి. ఈ అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన ఉత్తర్వులు జారీ చేయించాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ దుండిగల్ సర్కిల్ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి తురాయి భాను గౌడ్, ఉపాధ్యక్షుడు ఎంబరి ఆంజనేయులు, జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడు వెంకటేష్ నాయక్, మాజీ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు గోనె మల్లారెడ్డి, సీనియర్ నాయకులు సర్గారి సత్తిరెడ్డి, ధమ్మగారి ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పంతాలకు పోవద్దు.. పదోన్నతులు కోల్పోవద్దు...

**- ముందుండి ప్రత్యేక చొరవ తీసుకుని సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తా: డిజిపి సి.వి. ఆనంద్**





**హైదరాబాద్, సెప్టెంబర్ 15:(వార్తా ప్రభ ప్రతినిధి)**పంతాలకు పోయి పదోన్నతులు కోల్పోవద్దని 1991, 1995, 1996 బ్యాచ్‌ల డీఎస్పీలకు డిజిపి సి.వి. ఆనంద్ సూచించారు. పదోన్నతుల విషయంలో నెలకొన్న సమస్యను పరిష్కరించేందుకు తాను చొరవ తీసుకుంటానని, ముందుండి అవసరమైతే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఆయా బ్యాచ్‌లకు చెందిన డీఎస్పీలకు అదనపు ఎస్పీలుగా 37 మందికి పదోన్నతులు రావాల్సి ఉంది. అయితే కొందరు అధికారులు కోర్టులను ఆశ్రయించడంతో పదోన్నతుల ప్రక్రియ కొంతకాలంగా పెండింగ్‌లో ఉంది. ఈ నేపథ్యంలో డిజిపి చొరవ తీసుకుని డిజిపి కార్యాలయంలో శుక్రవారం ఆయా బ్యాచ్‌ల అధికారులతో సమావేశమయ్యారు. కేసుల విషయంలో నిర్ణయం తీసుకునేందుకు వారం రోజుల సమయం ఇచ్చారు. కోర్టు కేసుల కారణంగా పదోన్నతుల ప్రక్రియకు ఆటంకం ఏర్పడుతోందని డిజిపి వివరించారు. "కేసులు వేసుకుని నష్టపోవద్దు. మీ సమస్య పరిష్కారానికి నేను ముందుంటా. అందరూ సహకరిస్తే త్వరగా పదోన్నతులు కల్పించవచ్చు" అని సూచించారు. ప్రస్తుతం ఉన్న 37 అదనపు ఎస్పీ ఖాళీల కు వెంటనే పదోన్నతులు కల్పిస్తామన్నారు.

**కేసుల ఉపసంహరణకు ముందుకు..** డిజిపితో సమావేశం అనంతరం వరంగల్ జోన్‌కు చెందిన 1991, 1995, 1996 బ్యాచ్‌ల అధికారులు కోర్టులో దాఖలు చేసిన కేసులను ఉపసంహరించుకుంటున్నట్లు డిజిపికి లేఖ అందించారు. హైదరాబాద్ సిటీకి చెందిన 1991, 1995,1996 బ్యాచ్‌ల అధికారులు కూడా కేసుల ఉపసంహరణకు సుముఖత వ్యక్తం చేశారు. దీంతో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న డీఎస్పీల నుండి అదనపు ఎస్పీలుగా పదోన్నతుల అంశం కొలిక్కి వచ్చే అవకాశం ఏర్పడింది. డిజిపి సి.వి. ఆనంద్ చొరవతో సమస్య పరిష్కారం దిశగా కదలిక రావడంపై అధికారులు హర్షం వ్యక్తం చేశారు.

# జవహర్ నగర్‌లో గణేష్ నిమజ్జనానికి రోడ్డు మరియు విద్యుత్ వైర్ల ముప్పు.

**భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ట్రాఫిక్ సిఐ శివశంకర్ కి విన్నపించుకోవడం జరిగింది. స్పందించిన ట్రాఫిక్ సిఐ శివశంకర్**





**జవహర్ నగర్, సెప్టెంబర్ 15(వార్తా ప్రభ):**కీసర సర్కిల్ జవహర్ నగర్ చంద్రపురి కాలనీ డివిజన్‌జవహర్ నగర్ నుంచి మల్కారం, అరుంధతి నగర్, మీదుగా బిట్స్ పిలానికి వెళ్లే మార్గంలో గణేష్ నిమజ్జన ఊరేగింపులకు విద్యుత్ వైర్లు పెద్ద ముప్పుగా పరిణమించాయి. రహదారిపై విద్యుత్ తీగలు చాలా తక్కువ ఎత్తులో వేలాడుతుండటంతో, నిమజ్జనానికి తీసుకెళ్లే ఎత్తైన విగ్రహాలకు ఈ వైర్లు తగిలి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ తీవ్ర సమస్యపై భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి స్పందిస్తూ.. నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విద్యుత్ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని, వైర్ల ఎత్తును పెంచాలని విద్యుత్ శాఖాధికారులను కోరారు. సమాచారం అందుకున్న జవహర్ నగర్ ట్రాఫిక్ సిఐ శివశంకర్ తన సిబ్బందితో కలిసి ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. స్పందించిన ట్రాఫిక్ సిఐ శివశంకర్ తన సిబ్బందితో రిఫ్లెక్టర్ రేడియం పంపించడం జరిగింది. వెంటనే అక్కడ ఉన్న సభ్యులతో ఇనుప స్తంభాలకు అంటించడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ విషయాన్ని విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి, నాయకులు నరేందర్ యాదవ్, విక్రమ్, వంశీ, మహేష్ కే, మహేష్, పవన్, కృష్ణ, జాఫర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏఐటీయూసీ, ఏఐవైఎఫ్ నూతన నాయకులకు ఘన సన్మానం





**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సెప్టెంబర్ 15:(వార్తా ప్రభ ప్రతినిధి)**సుజాతనగర్: ఇటీవల కరీంనగర్‌లో జరిగిన ఏఐటీయూసీ రాష్ట్ర నాలుగో మహాసభల్లో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికైన సుజాతనగర్ ప్రాంతానికి చెందిన కొత్తగూడెం మేయర్ మూడు గణేష్, జక్కుల రాములు, ఊకే నాగేశ్వరరావులను, ఏఐవైఎఫ్ జిల్లా మహాసభల్లో జిల్లా నాయకుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన భూక్యా రాజేష్ను సుజాతనగర్ మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన నాయకులకు పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించి ఘనంగా అభినందనలు తెలిపారు. సుజాతనగర్ ప్రాంతానికి చెందిన నాయకులు రాష్ట్ర, జిల్లా స్థాయిలో కీలక బాధ్యతలు చేపట్టడం ఈ ప్రాంతానికి గర్వకారణమని నాయకులు పేర్కొన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణ, ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు, కార్మిక సంక్షేమం కోసం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మరిన్ని ఉద్యమాలు నిర్వహించాలని అన్నారు. కార్మిక వర్గాన్ని ఐక్యం చేస్తూ వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. అదేవిధంగా యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగం, ఉపాధి అవకాశాల కొరత, విద్య, ఉద్యోగ భద్రత, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ వంటి సమస్యలపై ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో బలమైన పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీపీఐ, ఏఐటీయూసీ, ఏఐవైఎఫ్, ప్రజాసంఘాలు నిరంతరం ప్రజల్లో ఉంటూ ఉద్యమాలను కొనసాగిస్తున్నాయని తెలిపారు. నూతనంగా ఎన్నికైన నాయకులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ కార్మికులు, యువత, పేదలు, సామాన్య ప్రజల తరఫున మరింత చురుకుగా పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో...సీపీఐ మండల కార్యదర్శి కోమరి హనుమంతరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు భూక్యా దశ్రు, తల్లూరి పాపారావు, సీపీఐ మండల సహాయ కార్యదర్శి లావుడియా గోపి, ఏఐటీయూసీ మండల అధ్యక్షులు వీర్ల మల్లేష్, టౌన్ సెక్రటరీ బొడ్డు కేశవరావు, సీపీఐ నాయకులు దండు నాగేశ్వరరావు, దండు సురేష్, కుమార్ కృష్ణ, వీర్ల దుర్గాప్రసాద్, ఏఐటీయూసీ, ఏఐవైఎఫ్ నాయకులు, ప్రజాసంఘాల బాధ్యులు, పార్టీ తదితరులు పాల్గొన్నారు.

వార్తా ప్రభ

# హైదరాబాద్

## ముత్యాలమ్మ దేవాలయంలో ఘనంగా వినాయక ప్రతిష్ఠాపన

**హెచ్‌ఏఎల్ రాఘవేంద్ర కాలనీ గణేష్ మండపంలో తొలి పూజ**

**వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలంతా ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థనలు**



**జీడిమెట్ల, సెప్టెంబర్ 15, (వార్తాప్రభ) :** జీడిమెట్ల 132 డివిజన్ పరిధిలోని హెచ్ఏఎల్ రాఘవేంద్ర కాలనీ ముత్యాలమ్మ దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వర మండపంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. మండపంలో గణపతి ప్రతిమను శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించి తొలి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో కుంట పద్మ సిద్ధిరాములు, కుంట సుగుణమ్మ పోచయ్య, కుంట నాగరాణి ఈశ్వర్, కుంట సౌమ్య యశ్వంత్, దిడ్డి పద్మ మల్లేశం, దిడ్డి వినోద లింగం, దిడ్డి మమత సురేష్ దంపతులు పాల్గొని గణనాథుడికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు జరిపించారు. విఘ్నేశ్వరుని కృపాకటాక్షాలతో కాలనీవాసులు, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు బాగుండాలని పూజారులు వేదమంత్రోచ్చారణలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మొదటిరోజు నిర్వహించిన ఈ వేడుకకు పెద్ద సంఖ్యలో కాలనీ ప్రజలు, మహిళలు, భక్తులు తరలివచ్చి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మండప ప్రాంగణం భక్తి నినాదాలతో మార్మోగింది.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత.

**-కాంగ్రెస్ నాయకులు మిరియాల ప్రీతమ్**



**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 15 (వార్తాప్రభ):**చందానగర్ డివిజన్ రాజీవ్‌నగర్‌లో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు .శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకుడు మిరియాల ప్రీతమ్ కుటుంబ సభ్యులతో కలిసి కాలనీవాసులతో పూజల్లో పాల్గొన్నారు. మిరియాల రాఘవ చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ మిరియాల రాఘవరావు కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రీతమ్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. వినాయక చవితి సందర్భంగా మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. పర్యావరణహితంగా పండుగలు నిర్వహించడం ద్వారా భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజీవ్‌నగర్ కాలనీవాసులు,యువకులు, భక్తులు పాల్గొన్నారు.

## శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి వైశ్య సంఘ అధ్యక్షులు గా నంబూరి సత్యనారాయణ మూర్తి మరోమారు ఎన్నిక



**అమలాపురం: సెప్టెంబర్ 15:(వార్తా ప్రభ ప్రతినిధి)**అమలాపురం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి వైశ్య సంఘ సర్వసభ్య సమావేశము మంగళవారం ఉదయం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి వైశ్య సంఘ పచ్చిగోళ్ళ జనార్దన రావు కళ్యాణ మండపంలో అధ్యక్షుడు నంబూరి సత్యనారాయణమూర్తి అధ్యక్షతన జరిగింది ఈ సందర్భంగా సంఘ ఆధ్వర్యంలో గత రెండు సంవత్సరాలలో జరిగిన పలు కార్యక్రమాల గురించి సభ్యులకు ఆయా విభాగాల చైర్మన్లు తెలియజేయగా ఈ రెండు సంవత్సరాల కాలంలో సంఘ జమ ఖర్చులను కోశాధికారి సర్వ సభ్యులకు తెలియజేశారు. అనంతరం ఇప్పుడున్న కార్యవర్గ కాలపరిమితి ముగిసిన సందర్భముగా సంఘ గడచిన కార్యవర్గ సమావేశంలో ఇదే కార్యవర్గన్ని మరొక రెండు సంవత్సరాలు పొడిగిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని సర్వసభ్య సమావేశంలో కూడా సర్వ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించడంతో అధ్యక్షునిగా నంబూరి సత్యనారాయణమూర్తి, కార్యదర్శిగా నంబూరి నరేష్, కోశాధికారిగా కొమ్మూరి ప్రసాద్ లు మరొక రెండు సంవత్సరాలు ఆ పదవుల్లో కొనసాగనున్నారు ఈ సందర్భంగా వీరిని అమలాపురం ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు యర్రమల్లి విశ్వేశ్వరరావు, కార్యదర్శి నూలు సూరిబాబు, కోశాధికారి శ్రీకాకోలపు రాంపండు లు కండువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలుపుగా కార్యక్రమంలో పాల్గొన్న సర్వ సభ్యులు వీరికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# సంపాదకీయం

## విశాఖలో కూటమి క్లీన్ స్వీప్ చేస్తుందా ?

స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ కూటమి సెంట్ పర్సెంట్ స్ట్రైక్ రేట్ సాధించాలని పట్టుదలగా ఉంది. దానికి దారి చూపించిన వారు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అని చెప్పక తప్పదు. 2024 ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ తనకు పొత్తులో భాగంగా దక్కిన 21 సీట్లకు గానూ మొత్తం గెలుచుకుని ఏపీ రాజకీయాల్లోనే కాదు దేశ రాజకీయాల్లోనే సంచలనం క్రియేట్ చేశారు. దాంతో ఇది కూటమి పార్టీలకు కూడా మోజు పెంచింది. ఇపుడు ఆ ముచ్చట తీర్చుకోవడానికి తగిన అవకాశం దక్కింది అని కూటమి పెద్దలు భావిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అయితే మొత్తం సీట్లు అన్నీ కూటమి గెలుచుకోవాలని పార్టీ నేతలకు స్పష్టం చేశారు. ఇపుడు అదే దిశగా అంతా ముందుకు సాగుతున్నారు. ఇక ఏపీలో కొన్ని కంచుకోటలల్లాంటి జిల్లాలు ఉన్నాయి. అక్కడ సెంట్ పర్సెంట్ స్ట్రైక్ రేట్ అన్నది సాధ్యమే అంటున్నారు. విజయవాడ, గుంటూరు లాంటి చోట్ల కూటమి ప్రభంజనం ఉంటుందని చెబుతున్నారు. అలాగే గోదావరి జిల్లాల్లో తమ పట్టుని గట్టిగా నిలుపుకోవడానికి కూటమి మిత్రులు చూస్తున్నారు. ఇదే వరసలో ఉత్తరాంధ్రలో పాగా వేయాలని చూస్తున్నారు. శ్రీకాకుళం విశాఖ జిల్లాలు టీడీపీకి కంచుకోటలుగా ఉన్నాయి. విజయనగరంలో తేడా పాడాలు లేకుండా చిన్న శ్రీను లాంటి వారిని ఇటు వైపు లాగేసి మరీ అక్కడ కూడా కూటమి జెండా పాతేయాలని చూస్తున్నారు. ఈ క్రమంలో ఉమ్మడి విశాఖ జిల్లాలో ఫలితాలు మరింత ఆసక్తిని రేపుతున్నాయి. వైసీపీ 2019 ఎన్నికల్లో ప్రభంజనం సృష్టించినప్పుడు విశాఖ జిల్లా చెక్కుచెదరలేదని అంటున్నారు. విశాఖ నగరంలో నాలుగు అసెంబ్లీ సీట్లూ టీడీపీ గెలుచుకుంది. 2024 నాటికి మొత్తానికి మొత్తం ఉమ్మడి జిల్లా సొంతం అయింది. ఇపుడు అదే మ్యాజిక్ ని రిపీట్ చేయడానికి చూస్తున్నారు అని అంటున్నారు. దీని మీద మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖ జిల్లాలో పంచాయతీ వార్డు మెంబర్ నుంచి జీవీఎంసీ మేయర్ దాకా మొత్తం అన్నీ కూటమి గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. వైసీపీకి ఎక్కడా చాన్స్ ఇచ్చేదే ఉండదని ఆయన చాలా నమ్మకంగా చెప్పారు. వైసీపీ వారు పోటీలో ఉంటే వారికి ముందే సంతాపం అని బీజేపీ ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు కామెంట్స్ చేశారు. విశాఖ జిల్లా టీడీపీ ప్రెసిడెంట్ పట్టాభిరాం అయితే విశాఖ ప్రజలు వైసీపీకి ఎపుడూ ఓటేయ్యలేదని అదే మళ్ళీ రిపీట్ అవుతుందని అంటున్నారు. కూటమి చూస్తే ఎన్నికల నోటిఫికేషన్ రాక ముందే పట్టు బిగించింది. కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు జరగలేదు కానీ కో ఆర్డినేషన్ మీటింగ్స్ జిల్లా స్థాయి నియోజకవర్గం స్థాయిలలో జరిగిపోతున్నాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ ఐక్యంగానే ముందుకు సాగాలి అన్న నినాదాన్ని గ్రౌండ్ లెవెల్ దాకా తీసుకుని వెళ్తున్నారు. మరో వైపు చూస్తే వైసీపీలో ఆ తరహా కో ఆర్డినేషన్ కనిపించడం లేదని అంటున్నారు. నాయకులు అంతా మీడియాకే పరిమితం అవుతున్నారని అంటున్నారు. ఇక వైసీపీ అధినాయకత్వం ఆరాటమే కానీ పోటీకి ఉత్సాహం చూపించే పరిస్థితి ఏ మేరకు ఉంది అన్నది కూడా చర్చకు వస్తోంది. సహజంగానే స్థానిక ఎన్నికలు అంటే అధికార పార్టీకి అనుకూలంగా ఉంటాయని భావన ఉంది. దాంతో వైసీపీ నేతలు కూడా గట్టిగా బరిలోకి దిగడానికి ఆలోచిస్తున్నారని అంటున్నారు. ఇక అంగబలం అర్థ బలమున్న కూటమికి కంచు కోటలలో విజయాలు సెంటిమెంట్ గా మారుతున్న నేపథ్యం ఉంది. దాంతోనే కూటమి నేతలు సెంట్ పర్సెంట్ స్ట్రైక్ రేట్ అని ప్రకటిస్తున్నారు. ఈ విధంగా రాజకీయ ప్రత్యర్థి వైసీపీ మీద ఎన్నికల కంటే ముందే నైతిక విజయాన్ని సాధించేందుకు చూస్తున్నారు అని అంటున్నారు.

# శ్రీ లక్ష్మీ గణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో గణపతి మహోత్సవములు

### ప్రభుత్వం చవితికి ఉచిత కరెంట్ అన్ని మతాలకు సమాన ప్రాధాన్యత
### సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు





విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 15 :(వార్త ప్రభ ప్రతినిధి)వినాయక చవితి పండుగ పురస్కరించుకుని స్థానిక 64వ, డివిజన్ కండ్రికలో 8వ సంవత్సర శ్రీ లక్ష్మీ గణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో గణపతి మహోత్సవములు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాలకు సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ముఖ్య అతిధిగా పాల్గొనగా, శ్రీలక్ష్మీ గణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ నిర్వాహకులు,సభ్యులు ఎమ్మెల్యేకు మేళ తాళాలతో స్వాగతం పలికారు. సోమవారం ఉదయం 10.30నిమిషాలకు ఎమ్మెల్యే స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించి, చవితి పందిరిలో వినాయక విగ్రహానికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.శ్రీ సిద్ధిబుద్ధి సమేత శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి చవితి నవరాత్రి ఉత్సవములు శ్రీ లక్ష్మీగణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆర్గనైజర్ కె.రవికుమార్ ఆధ్వర్యంలో సెప్టెంబర్14వ తేదీ నుండి 23వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 7.30 నిమిషాలకు ప్రాతఃకాలపూజ, 10గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.హిందువులు పరమ పవిత్రంగా పూజించే తొలి పూజార్హుడు ఘన నాధుని పండుగను దేశంలోనే కాకుండా ప్రపంచంలో అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నారని అన్నారు.ప్రభుత్వం తరుపున చవితి పందిళ్లకు ఉచిత కరెంట్, పర్మిషన్లు ఇచ్చామని, అన్ని మతాలను సమానంగా చూడడమే తమ అభిమతం అన్నారు.శ్రీ లక్ష్మీగణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆర్గనైజర్ కె.రవికుమార్ ఆధ్వర్యంలో గత 8సంవత్సరాల నుండి చవితి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు.స్వామివారికి పూజా కార్యక్రమాలతో పాటు ప్రతిరోజూ మధ్యాహ్నం12గంటల నుండి భక్తులకు నిత్యాన్నదానం నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.స్వామి సేవకుశ్రీ లక్ష్మీ గణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ కమిటీ సభ్యులు, అనేకమంది దాతలు సహాయ సహకారాలు అందిస్తున్నారని శ్రీ లక్ష్మీ గణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ నిర్వహికుడు కె రవికుమార్ తెలిపారు.రెండో రోజు....రెండో రోజు మంగళవారం జరిగిన వేడుకలలో ఉదయం సుబ్రహ్మణ్యం స్వామి వారికి అర్చన, సాయంత్రం ఆంజనేయ స్వామి వారికి తమలపాకుల సింధూర అర్చన, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు తనయుడు సిద్ధార్థ ఈ వేడుకల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ఆశీస్సులు అందుకున్నారు. ఈకార్యక్రమంలో అల్లు మహేష్, పొలిశెట్టి చంద్ర శేఖర్, పల్లెల రవి, అల్లు నరేంద్ర,తోట సత్యనారాయణ,తోట వెంకట ప్రసాద్,పట్టేం శెట్టి నాగమణి,ఇ. హరికృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విజయవాడ నగరంలో నగరాల కులస్థులకు ఏమైయ్యింది..... ఐక్యతా రాగం నిజమేనా

**● రాబోయే స్థానిక ఎన్నికల్లో నగరాలకు. అన్ని రాజకీయ పార్టీలు ఎక్కువ సీట్లు కల్పించాలి ● రాష్ట్ర వ్యాప్తంగా నగరాల సంఘాలు రౌండ్ టేబుల్ సమావేశం ● ముందస్తుగా మేల్కొని గళం విప్పిన నాగరాల కులసంఘాల నాయకులు**



(యేమినేని వెంకట రమణ)

విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 15 :(వార్త ప్రభ ప్రతినిధి) విజయవాడ నగరంలోని నాగరాల కులస్తులకు ఎన్నో దశబ్దాల తరువాత జ్ఞానోదయం కలిగింది. దానికి తొలి అడుగుకు శ్రీ నగరాల సీతారామస్వామి, శ్రీ మహాలక్ష్మి అమ్మవార్ల దేవస్థానం పాలకవర్గం ఎన్నికలు ఏకగ్రీవంగా కావడంతో బీజం పడిందని చెప్పొచ్చు. గతంలో రాజకీయ పార్టీలు, వర్గాల పోరుతో ఎవ్వరికి వారే యమునా తీరే లాగా ప్రవర్తన తో నువ్వా నేనా అని బరులు గీసుకొన్న వారి మెదళ్లు బూజులు దులుకొని ఐక్యతా రాగాలు అందుకొన్నాయి. సొంత కులస్తులే ఎన్నికలు బరిలో దిగితే అనాడు దివంగత రాయన విశ్వేశ్వరరావు, దివంగత కొరగంజి శేఖర బాబుకే పట్టం కట్టలేదు. తరువాత పోతిన వెంకట మహేష్ సైతం ఘోరం ఓడిపోయేలా చేశారు.ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలపై ద్రుష్టి సారించారు. అందరూ ఐక్యంగా వుండాలని బుద్ధిమంతుల్లగా ఒక తాటిపైకి వచ్చారు. వీరి ప్రయత్నంకి సొంత కులస్తులే గండి కొట్టకుండా ఉంటారేమో కాలమే నిర్ణయించాలి.ఎన్టీఆర్ జిల్లా విజయవాడ పశ్చిమ నియోజకవర్గం.విజయవాడలో నగరాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 20 నగరాల కుల సంక్షేమ సంఘాలు ఐక్య మత్యమే ఆయుధంగా కలిసి ఏకకంఠంతో విజయవాడ వన్ టౌన్ చిట్టినగర్ శ్రీ మహాలక్ష్మి అమ్మవారి కళ్యాణ మండపములో ఇటీవల రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. నగరాల కులానికి. చెందిన సంఘాల అధ్యక్షులు,నాయకులుమాట్లాడుతూ..ఏ రాజకీయ పార్టీ అయితే తమ కులానికి రాష్ట్రంలో రాజకీయంగా తమ కులంలో ఉన్నటువంటి వ్యక్తులకు రాజకీయంగా అవకాశం కల్పించిందో ఆ పార్టీకి ఆ వ్యక్తి విజయానికి రాష్ట్రవ్యాప్తంగా కుల సంఘాలు పనిచేస్తాయని సంఘాల నేతలు అన్నారు. రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో ఉత్తరాంధ్ర జిల్లాల్లోనూ విజయవాడ నగరంలోని విశాఖపట్నం నగరంలో మైలవరం గన్నవరం.నియోజకవర్గాల యందు ఎక్కడెక్కడ నగరాల కులస్తుల ప్రాధాన్యత ఉన్నదో ఆయా ప్రాంతాల్లో తమ కులానికి చెందిన వ్యక్తులకు టికెట్లు ఇచ్చిప్రోత్సహించాల్సిందిగా అన్ని రాజకీయ పార్టీల రాష్ట్ర అధినేతలకు విజ్ఞప్తి చేయాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో రాష్ట్రంలో ఉన్నటువంటి నగరాల కుల సంఘాలుతో పాటు రాజకీయ పార్టీ. అధ్యక్షులు నాయకులు పాల్గొని ఈ తీర్మానించడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ నగరాల వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ గా నియమితులైన మరుపిల్ల తిరుమలేష్ రావు అకాల మరణంతో ఏర్పడిన చైర్మన్ ఖాళీ పదవిని త్వరగా చైర్మన్ ని నియమించవలసిందిగా ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమానికి పార్టీలు అతీతంగా తెలుగుదేశం పార్టీ,జనసేన పార్టీ, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. కమ్యూనిస్టు పార్టీ. నాయకులతోపాటు. శ్రీ నగరాల సంఘం ఆంధ్రప్రదేశ్,, నగరాల ఐక్యవేదిక, కృష్ణాజిల్లా నగరాల సంఘం., అర్బన్ నగరాల సంఘం., ఆంధ్రప్రదేశ్ నగరాల యువజన సంఘం.., చిట్టి నగర అమ్మవారి దేవస్థానం కమిటీ., శ్రీ నగరాలు ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ.., నగరాలు వెల్ఫేర్ సొసైటీ., నగరాలు ఎడ్యుకేషన్ సొసైటీ.. నగరాల కుల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు.. తదితరులు పాల్గొన్నారు.ఐతే ప్రయత్నం మంచిదేగాని పీతల బుట్ట లాంటి నాగరాల్లో ఐక్యత పాటించడం ఎంతవరకు సాధ్యం అవుతుందో కాలమే నిర్ణస్తుందని నాగరాల కుల పెద్దలు పెదవులు విరుస్తున్నారు.

# మూడో రోజుకు చేరిన బాయన బాబూజీ ఆమరణ నిరాహార దీక్ష

### క్షీణిస్తున్న ఆంధ్రప్రదేశ్ నగరాల సంఘం అధ్యక్షులు బాయన బాబూజీ ఆరోగ్యం



**విజయవాడ పశ్చిమ, సెప్టెంబర్ 15,(వార్త ప్రభ ప్రతినిధి ):** ఆంధ్ర ప్రదేశ్ నగరాల కార్పొరేషన్ చైర్మన్ పదవిని వెంటనే భర్తీ చేయాలని కూటమి ప్రభుత్వాన్ని కోరుతూ ఆంధ్రప్రదేశ్ నగరాల సంఘం అధ్యక్షులు బాయన బాబూజీ (బాబ్జి) చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష మంగళవారంతో మూడో రోజుకు చేరింది. కొత్తపేట నగరాల రామాలయం వద్ద ఉన్న బాయన బాబూజి దీక్ష శిబిరాన్ని సందర్శించిన పలువురు నాయకులు బాబూజీ ఆరోగ్యం దినదినం క్షీణించడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం నగరాలు కార్పొరేషన్ చైర్మన్ పదవిని భర్తీ చేసి బాబూజి దీక్షను విరమింప చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరాల కార్పొరేషన్ చైర్మన్ గా పదవి బాధ్యతలు చేపట్టిన తిరుమలేష్ మృతి చెంది దాదాపు పది నెలలు కావస్తున్న, ఇంతవరకు ప్రభుత్వం చైర్మన్ పదవిని భర్తీ చేయకపోవడంతో నగరాల సామాజిక వర్గానికి సరైన గౌరవం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నగరాల కార్పొరేషన్ కు చైర్మన్ లేకపోవడంతో నగరాల కులస్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. నగరాల సామాజిక వర్గం అభ్యున్నతిని కోరుతూ ఆంధ్ర ప్రదేశ్ నగరాల సంఘం అధ్యక్షులు బాబూజీ చేస్తున్న దీక్షపై రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల నుంచి నగరాల నాయకులు ఫోన్లు చేసి ఆయన ఆరోగ్యం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఆమరణ నిరాహార చేస్తున్న బాబూజీని విజయవాడ నగర మాజీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, బిసి సంఘం నాయకులు పోతిన వర ప్రకాష్, పొట్నూరి రాజా, ఆంధ్ర ప్రదేశ్ నగరాల యువజన సంఘం అధ్యక్షులు బాయన బెనర్జీ, ఇంకా పలువురు ప్రముఖులు పరామర్శించారు. ఆయన దీక్షకు తమ సంఘీభావాన్ని ప్రకటించారు. కాగా మధ్యాహ్న సమయంలో వచ్చిన డాక్టర్లు బాబూజీకి వైద్య పరీక్షలు నిర్వహించారు.

# నిరాహార దీక్షను రాజకీయం చేయడం తగదు

### మాజీ మంత్రి వెలంపల్లి పై న్యాయవాది ఈది సూరిబాబు విమర్శ



**విజయవాడ పశ్చిమ, సెప్టెంబర్ 15 : (వార్త ప్రభ ప్రతినిధి)** నగరాల కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ పోస్టును వెంటనే భర్తీ చేయాలని కోరుతూ ఆంధ్ర ప్రదేశ్ నగరాల సంఘం అధ్యక్షులు బాయన బాబూజీ చేపట్టిన నిరాహార దీక్షను మాజీమంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు రాజకీయం చేయడం సరైనది కాదని నగరాల సామాజిక వర్గ ప్రముఖులు, ప్రముఖ న్యాయవాది ఈది సూరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో ఘాటుగా విమర్శించారు. నిరాహార దీక్ష చేపట్టి ఒకరోజు ముగియకముందే వైసీపీ నాయకులు బాబూజీ నిరాహార దీక్షని సందర్శించడం, శిబిరాన్ని హైజాక్ చేసి కూటమి ప్రభుత్వం పై విమర్శలు చేయడం అవకాశం కోసం ఎదురు చూస్తున్న నాయకుల కుట్ర తప్ప మరొకటి కాదన్నారు .వైసీపీ లో ఉన్న రెండు వైసీపీ వర్గాల ఆధిపత్య పోరులో భాగంగా ఈ శిబిరాన్ని వాడుకోవడం, రాజకీయం చేసి నగరాల కార్పొరేషన్ ని వివాదం చేయడం, తద్వారా కూటమి ప్రభుత్వాన్ని అప్రదిష్టపాలు చేయాలనే తలంపు మాత్రమే కనపడుతుందనీ సూరిబాబు విమర్శించారు. నగరాల కార్పొరేషన్ సమస్య పై మాట్లాడకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు గురించి వెలంపల్లి వెన్నుపోటు రాజకీయాలు అని విమర్శించడం సహేతుకమా? రాజకీయమా? దానికి దీనికి సంబంధం ఏమైనా ఉందా? అంటూ ఘాటుగా ప్రశ్నించారు. బాబూజీ దీక్షను బలహీన పరచి తద్వారా రాజకీయ లబ్ది పొందాలనే కుట్ర పూరిత వాఖ్యలు చేయడం తగదని పేర్కొన్నారు. ఇది నగరాల సామాజిక వర్గంలో చిచ్చు పెట్టడం కాదా? అంటూ ప్రశ్నించారు. వచ్చే పదవి అడ్డుకోవడం తప్ప వారికి వేరే పని లేదన్నారు. కుల రాజకీయాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు.

# దసరా మహోత్సవాలు - శ్రీ కనకదుర్గామాత అమ్మవారి దర్శనాల్లో.... విపరీతమైన విఐపి ల తాకిడి... విఐపి దర్శనాలు కట్టడి చెయ్యండి

### సామాన్య భక్తులకూ అమ్మవారి దర్శనంకి ప్రాధాన్యత ఇవ్వండి
### జిల్లా కలెక్టర్ లక్ష్మీశాకి ఎమ్మెల్సీ వర్ల రామయ్య విజ్ఞప్తి



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 15 :(వార్త ప్రభ ప్రతినిధి)** దసరా మహోత్సవం సందర్భంగా సామాన్య భక్తులు ఎదుర్కొనే ఇబ్బందులు, విఐపి తాకిడి వాటి నియంత్రణ గురించి ఎమ్మెల్సీ వర్ల రామయ్య ఎన్ టి ఆర్ జిల్లా కలెక్టర్ కి ప్రత్యేక విజ్ఞప్తి చేశారు. దానికి సంబందించిన ఓ లేఖ రాశారు. అయన వ్యక్త పరిచిన సారాంశం ఇలా వుంది. ప్రతి ఏటా విజయవాడ ఇంద్రకీలాద్రిపై వేంచేసియున్న శ్రీ దుర్గా మల్లిఖార్జునస్వామి వార్ల దసరా మహోత్సవాలు ఈ ఏడాది కూడా అక్టోబర్ 11 నుండి 20 వరకు బహు ఘనంగా జరుప ముహూర్తం నిర్ణయించిన విషయం అందరికీ విదితమే. ఈ మహోత్సవాల సందర్భంగా 1975 నుండి అమ్మవారి దసరా మహోత్సవాలనిర్వహణ గమనిస్తున్న వ్యక్తిగా ఒక విషయాన్ని మీ దృష్టికి తీసుకురావాలని ఈ లేఖ మీకు వ్రాస్తున్నాను.మొదటి రోజు నుండి మూలా నక్షత్రంతో సహా చివరి రోజు వరకు, తెప్పోత్సవంలో కూడా విఐపిల దర్శనాలపేరిట వారి తాకిడి చాలా ఎబ్బెట్టుగా ఉంటూ ఉన్నది. సామాన్య భక్తులందరూ దీనిని గర్హిస్తూఅసహ్యించుకుంటున్నారు. పోలీసు శాఖలో కానిస్టేబుల్ నుండి కమీషనర్ వరకు... రెవెన్యూ శాఖలో అటెండర్నుండి కలెక్టర్ వరకు... ఇరిగేషన్ శాఖలో బంట్రోతు నుండి చీఫ్ ఇంజనీర్ వరకు... ఇక... దేవాదాయధర్మాదాయ శాఖలో అంతే లేదు, మందలు మందలుగా విఐపి ల పేరిట ప్రత్యేక దర్శనాల కోసం గుడిపై దాడిచేస్తే ఇక సామాన్య భక్తుల గతేంటి? దీనిపై మీరు, గౌరవ పోలీస్ కమీషనర్ , మీ సమీక్షా సమయాలలోసీరియస్ గా చర్చించి, ఈ విఐపి ల దర్శనాల తాకిడిని కంట్రోల్ చేయడానికి సముచిత నిర్ణయం తీసుకోవడానికిఇది సరైన సమయమని అనుకుంటున్నాను. అమ్మవారికి ప్రాధాన్యత సామాన్య భక్తుడే.కావున, మీరు, గౌరవ విజయవాడ పోలీస్ కమీషనర్ దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టి విఐపి దర్శనాలకుప్రతిరోజూ ఏదో ఒక ప్రత్యేక సమయం కేటాయించి, గట్టిగా అమలుచేసి, సామాన్య భక్తులకు ఇబ్బందులులేకుండా, అసౌకర్యం కలగకుండా తగు చర్యలు తీసుకోవలసినదిగా కోరుతున్నానని అంటూ వర్ల రామయ్య తన విజ్ఞప్తి లో పేర్కొన్నారు.

# మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని గారి అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతికరం

### మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు సంతాపం



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 15 :(వార్త ప్రభ ప్రతినిధి)** మాజీ ఉప ముఖ్యమంత్రి, ఏలూరు మాజీ శాసనసభ్యులు ఆళ్ల కాళీ కృష్ణ శ్రీనివాస్ (నాని) ఆకస్మిక మరణం పట్ల మాజీ మంత్రి శ్రీ వెలంపల్లి శ్రీనివాసరావు తీవ్ర దిగ్భ్రాంతిని, తీవ్ర వేదనను వ్యక్తం చేశారు. అత్యంత ఆప్తులైన ఆళ్ల నాని ఇంత త్వరగా మనల్ని విడిచివెళ్లడం కలచివేసిందని ఆయన విచారం వ్యక్తం చేశారు.ఉప ముఖ్యమంత్రిగా, వైద్యారోగ్య శాఖ మంత్రిగా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని ఆయన కొనియాడారు. ?దివంగత ఆళ్ల నాని పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తూ... వారి కుటుంబ సభ్యులకు, అనుచరులకు, అభిమానులకు వెలంపల్లి శ్రీనివాసరావు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ తీరని దుఃఖాన్ని భరించే మనోధైర్యాన్ని వారి కుటుంబానికి ప్రసాదించాలని భగవంతుడిని వేడుకున్నారు.

# దేశ సమైక్యతకు హిందీ దోహదం







**విజయవాడ పశ్చిమ, సెప్టెంబర్ 15: (వార్త ప్రభ ప్రతినిధి)** భాషా వైవిధ్యంతో కూడిన భారత దేశంలో సమన్వయానికి హిందీ వారధిగా నిలుస్తోం దని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం హిందీ విభాగాధిపతి ఆచార్య కాకాని శ్రీకృష్ణ అన్నారు. కేబీఎన్ కళాశాల హిందీ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం హిందీ దివస్ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన హిందీ రాజభాషగా ఆవిర్భవించిన చారిత్రక, సామాజిక నేపథ్యాన్ని వివరించారు. హిందీపై పట్టు సాధిస్తే విద్య, ఉద్యోగ రంగాల్లో విస్తృత అవకాశాలు లభిస్తాయని తెలిపారు.కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. కృష్ణవేణి మాట్లాడుతూ భాషా నైపుణ్యానికి నిరంతర సాధనే మార్గమని, విద్యార్థులు పరస్పరం హిందీలో సంభాషించడం ద్వారా ప్రావీణ్యం పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అనువాదం, నినాద రచన, వాద--వివాదం, కవితా పఠనం పోటీలు నిర్వహించారు. విజేతలుగా ఎస్.కె. ముహీనా, వి. హిమబిందు, ఎం.డి. ఫెర్డోస్, ఆనంద్ మౌర్య నిలిచారు. హిందీ విభాగాధిపతి కే. రేణుక, అధ్యాపకురాలు కె. శారద తదితరులు పాల్గొన్నారు.

# బాలింత పౌష్టికాహారం తీసుకోవాలి



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 15(వార్తా ప్రభ ప్రతినిధి):** బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని కాచవరం అంగన్ వాడి కేంద్రంలో బాలింతలకు అవగాహన కల్పించారు.ఐసిడిఎస్ ప్రాజెక్టు మైలవరం సిడిపిఓ పుష్పలత ఆదేశాలతో మండల పరిధిలోని కాచవరం అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసం సందర్భంగా తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారం వల్ల ఆహార పదార్థాల తల్లికి పాలు వస్తాయని, తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమైన తెలిపారు. ఆహారం వండేటప్పుడు భోజనం తినేటప్పుడు టాయిలెట్ ఉపయోగించినప్పుడు చేతులు పరిశుభ్రంగా కనుక్కోవాలని, ఆహారం వండేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు అలాగే ఉప్పు నూనె చక్కెర వాడకం తక్కువగా ఉండాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ మాధవి అంగన్వాడీ కార్యకర్తలు ఉమాలక్ష్మి రంగమ్మ శివకుమారి తల్లులు తండ్రులు పాల్గొన్నారు.

# ప్రేమ కాస్త చూపించూ...

కన్నీళ్ళతో ప్రేమగా
కొండంత ధైర్యంగా
ఉంటేనే ఆనందము
పెరుగుతుంది మనోబలము
పలకరించు నవ్వుతూ
ప్రేమ కాస్త చూపుతూ
పులకరించు చిరు
హృదయము
వారికది పర్వదినము
కొన్ని బంధాలు దొరకవు
ధనాన్ని వెచ్చించినా
వెదికినా దరి చేరవు
పిదప వెంపర్లాడినా
ఆలోచించు కొంచెము
కనురెప్పలా చూడుము




ఇల్లంతా దీవెనలు
అడుగడుగునా శుభములు

-గద్వాల సోమన్న,
ఎమ్మిగనూరు,
సెల్ :9966414580

# సాగరతీరంలో కొలువుదీరిన విజయగణపతి

***63 అడుగుల మట్టి మహాగణపతికి వైభవంగా పూజలు.***

***వేలాదిగా తరలివచ్చిన భక్తులు.***

***11 రోజుల పాటు ఉత్సవాలు.***



**మచిలీపట్నం సెప్టెంబర్ 15:(వార్తా ప్రభ ప్రతినిధి)**వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మచిలీపట్నం మంగినపూడి సాగర తీరంలో మహాగణపతి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా ప్రారంభమయ్యాయి. సాగరతీరంలో 63 అడుగుల ఎత్తులో మట్టితో రూపొందించిన విజయగణపతి విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. గణనాథుని దర్శించుకునేందుకు కృష్ణాజిల్లాతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు.వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ విజయగణపతి విగ్రహానికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, నీలిమ దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహాగణపతికి విశేష పూజలు చేశారు.మంత్రి కొల్లు రవీంద్ర--నీలిమ దంపతులతో పాటు పలువురు దంపతులు శ్రీ లక్ష్మీ గణపతి హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ తదితర ప్రముఖులు మంగినపూడి సాగరతీరానికి చేరుకుని మహాగణపతిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.విజయగణపతిని దర్శించుకున్న భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. దీంతో మంగినపూడి సాగర తీరం భక్తజన సందోహంతో సందడిగా మారింది. గణనాథుని దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవ కమిటీ విస్తృత ఏర్పాట్లు చేసింది.ఉత్సవాల్లో భాగంగా మహాగణపతి ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కళావేదికపై సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తి, ఆధ్యాత్మికత, కళా కార్యక్రమాల సమ్మేళనంగా ఉత్సవ ప్రాంగణం సందడిగా కనిపించింది.11 రోజుల పాటు జరిగే మహాగణపతి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. భక్తుల సౌకర్యార్థం తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుద్ధ్య నిర్వహణ, భద్రత, జనసమూహ నియంత్రణ, వైద్య శిబిరాలు తదితర ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నారు.

## గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయ నూతన టెర్మినల్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

**ఎంపీ వల్లభనేని బాలశౌరికి ఆకుల శ్రీనివాస్ వినతి**



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 15: (వార్త ప్రభ ప్రతినిధి)**గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయంలో నిర్మాణంలో ఉన్న నూతన టెర్మినల్ బిల్డింగ్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని గన్నవరం ఎయిర్ పోర్ట్ అడ్వైజరీ కమిటీ చైర్మన్, బందరు పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరిని సీనియర్ రాజకీయ నాయకులు, ప్రముఖ సామాజికవేత్త ఆకుల శ్రీనివాస్ కోరారు. మంగళవారం విజయవాడలో బాలశౌరిని ఆయన మర్యాదపూర్వకంగా కలిసి ఈ మేరకు ఒక వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఆకుల శ్రీనివాస్ మాట్లాడుతూ విజయవాడ, అమరావతి పరిసర ప్రాంతాల ప్రజలకు, వ్యాపారవేత్తలకు, విదేశీ ప్రయాణికులకు గన్నవరం విమానాశ్రయం అత్యంత కీలకమైనదని పేర్కొన్నారు. నూతన టెర్మినల్ అందుబాటులోకి వస్తే ప్రయాణికులకు అంతర్జాతీయ స్థాయి వసతులు లభిస్తాయని, విమాన సర్వీసుల సంఖ్య కూడా పెరుగుతుందని ఆయన ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు.కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి, నిధుల విడుదలకు మరియు పనుల వేగవంతానికి చొరవ చూపాలని ఎంపీ బాలశౌరిని శ్రీనివాస్ అభ్యర్థించారు. 470 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న నూతన ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ ను ఈ ఏడాది నవంబర్ లోపు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అభ్యర్థించారు. ఈ టెర్మినల్ త్వరగా అందుబాటులోకి వస్తే విదేశాలకు మరిన్ని విమాన సర్వీసులు ప్రారంభమై ఇక్కడి వ్యాపార, ఐటీ రంగాలకు, ప్రవాస ఆంధ్రులకు ఎంతో లబ్ధి చేకూరుతుందని వివరించారు. దీనిపై ఎంపీ బాలశౌరి సానుకూలంగా స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి నూతన టెర్మినల్ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## హోటల్ వసంత్ మార్గలో అగ్నిమాపక భద్రతా ప్రమాణాలపై ఆకస్మిక తనిఖీ

**వారం రోజుల లోపు అగ్నిమాపక పరికరాలు పూర్తిస్థాయిలో పని చేయాలి - లేనిచో చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్న సిబ్బంది**



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 15 :(వార్త ప్రభ ప్రతినిధి)** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం రీజినల్ ఫైర్ ఆఫీసర్ సి.హెచ్. రత్నబాబు తమ సిబ్బందితో కలిసి లబ్బీపేట లోని హోటల్ వసంత్ మార్గలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీల్లో హోటల్‌కు ఫైర్ ఎన్ఓసీ (అగ్నిమాపక అనుమతి పత్రం) లేదని గుర్తించారు. అదేవిధంగా, హోటల్‌లో అందుబాటులో ఉన్న కొన్ని అగ్నిమాపక పరికరాలు సైతం పనిచేయని స్థితిలో ఉన్నట్లు అధికారులు గమనించారు. ఈ నేపథ్యంలో హోటల్ యాజమాన్యానికి వారం రోజుల గడువు విధించి, ఆలోగా అవసరమైన అగ్నిమాపక భద్రతా చర్యలను పూర్తిచేయాలని, అన్ని ఫైర్ సేఫ్టీ పరికరాలను పనిచేసే స్థితిలో ఉంచాలని ఆదేశించారు.జనసాంద్రత అధికంగా ఉండే ప్రాంతంలో హోటల్ నిర్వహిస్తున్నందున అగ్నిమాపక భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు స్పష్టం చేశారు. నిర్ణయించిన గడువులోగా లోపాలను సరిదిద్దకపోతే నిబంధనల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హోటల్ యాజమాన్యాన్ని హెచ్చరించారు.ఈ తనిఖీల్లో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నరేష్, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎంపీ కార్యాలయంలో ఎంపీ కేశినేని శివనాథ్( చిన్ని )తో పశ్చిమ నియోజకవర్గ ఇంచార్జ్ బుద్ధా వెంకన్న భేటీ



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 15 :(వార్త ప్రభ ప్రతినిధి)** రానున్న విజయవాడ నగర కార్పొరేషన్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పశ్చిమ నియోజకవర్గం లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ఎంపికపై ఎంపీ కేశినేని శివనాథ్ ( చిన్ని ), పశ్చిమ నియోజకవర్గ ఇంచార్జ్ బుద్ధా వెంకన్న సుమారు గంటసేపు కీలకంగా చర్చించారు.పశ్చిమ నియోజకవర్గంలోని డివిజన్ లో తెలుగుదేశం పార్టీ బలోపేతం, ప్రజల్లో ఉన్న ఆదరణ, పార్టీ కోసం కష్టపడుతున్న నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలు తదితర అంశాలపై ఇరువురు నేతలు సమగ్రంగా చర్చించారు. పార్టీ విజయమే లక్ష్యంగా స్థానిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని బలమైన అభ్యర్థులను ఎంపిక చేయడం, నాయకులు--కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ఎన్నికలకు సిద్ధం కావాలని నేతలు నిర్ణయించారు.

# హామీల అమలుకు కాంట్రాక్ట్ ఉద్యోగుల శాంతియుత పోరుబాట

**రెగ్యులరైజేషన్, 100 శాతం స్థూల వేతనం ఇవ్వాలి అని డిమాండ్..**

**జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం.**



**మచిలీపట్నం సెప్టెంబర్ 15:(వార్తా ప్రభ ప్రతినిధి)**వైద్య, ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కాంట్రాక్ట్ ఉద్యోగులు శాంతియుత పోరుబాటకు సిద్ధమయ్యారు. ఏపీ మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 8 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 30 రోజులపాటు శాంతియుత నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు.కాంట్రాక్ట్ ఉద్యోగులందరికీ న్యాయం చేయాలని, ప్రధాన డిమాండ్‌గా ఉన్న ఉద్యోగుల క్రమబద్ధీకరణను చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఉద్యోగులకు 100 శాతం స్థూల వేతనం చెల్లించడంతో పాటు ఆర్థిక, ఆర్థికేతర సమస్యలను పరిష్కరించాలని కోరారు.ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికే వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి, ముఖ్య కార్యదర్శి, కమిషనర్, సంయుక్త సంచాలకులు, వైద్య విద్య సంచాలకులు, ప్రజారోగ్య సంచాలకులు, వైద్య సేవల సంచాలకులు తదితర ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సమర్పించినట్లు కమిటీ నాయకులు తెలిపారు.ఆర్థికేతర సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి 30 రోజుల్లో సమస్యలను పరిష్కరిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని పేర్కొన్నారు. అదేవిధంగా వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలోని కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, 100 శాతం స్థూల వేతనం తదితర ఆర్థిక అంశాలపై కూడా 30 రోజుల్లో చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చినట్లు తెలిపారు.అయితే హామీలు ఇచ్చి అమలులో మాత్రం జాప్యం చేయడం సరికాదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి తమ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.30 రోజుల శాంతియుత నిరసన కార్యక్రమాల అనంతరం కూడా ప్రభుత్వం స్పందించకపోతే, హామీల అమలు తీరును బట్టి తదుపరి కార్యాచరణను మరింత ఉధృతం చేస్తామని కాంట్రాక్ట్ ఉద్యోగుల కమిటీ నాయకులు హెచ్చరించారు.

# వినాయక నిమజ్జన ప్రాంతాల్లో 15 వేల కేజీల పూజా వ్యర్థాల సేకరణ

**నిమజ్జన ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య చర్యలు: కమిషనర్ ధ్యానచంద్ర**



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 15 :(వార్త ప్రభ ప్రతినిధి )**వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా నగరంలోని వివిధ నిమజ్జన ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టినట్లు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు.నిమజ్జన ప్రాంతాల్లో పూజా వ్యర్థాలను ఎప్పటికప్పుడు సేకరించి, వేరుచేసేందుకు ప్రత్యేక పారిశుధ్య సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు కమిషనర్ తెలిపారు. ప్రకాశం బ్యారేజ్ 2 క్రేన్లు ఏర్పాటుచేసి వినాయకుని నిమజ్జనం చేస్తున్నామని తెలిపారు, 12 మంది పారిశుధ్య కార్మికులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి, నిమజ్జనం సందర్భంగా వచ్చే పూలు, పూజా సామగ్రి తదితర వ్యర్థాలను ఎప్పటికప్పుడు వేరుచేసి సేకరిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా పున్నమి ఘాట్ వద్ద 10 మంది, భవానీ ఘాట్ వద్ద 10 మంది పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.నగరంలోని వివిధ నిమజ్జన ప్రాంతాల్లో పూజా వ్యర్థాల నిర్వహణను పర్యవేక్షించేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్లు నిరంతరం పర్యటిస్తున్నాయని కమిషనర్ తెలిపారు. ఇప్పటివరకు సుమారు 15,000 కేజీల పూజా వ్యర్థాలను సేకరించినట్లు వెల్లడించారు.అంతేకాకుండా నగరంలోని కాలువల వద్ద బ్యారిగేట్లను ఏర్పాటు చేసి, ప్రజలు నీటిలో ఎలాంటి పూజా వ్యర్థాలను వేయకుండా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. నీటిలో అనుకోకుండా కలిసిపోయిన వ్యర్థాలను కూడా ట్రక్సర్ మెషిన్ల సహాయంతో ఎప్పటికప్పుడు తొలగిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు .సేకరించిన పూల వ్యర్థాలను వినియోగించి అగరబత్తులు, ధూప్ స్టిక్స్ వంటి ఉత్పత్తులను తయారు చేయడంతో పాటు, ఇతర పూజా వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో ప్రాసెస్ చేసి సేంద్రియ ఎరువుల తయారీకి వినియోగిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. వినాయక నిమజ్జనం సందర్భంగా భక్తులు పూజా వ్యర్థాలను కాలువలు, జల వనరుల్లో వేయకుండా నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన సిబ్బందికి అందజేసి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కమిషనర్ ధ్యానచంద్ర విజ్ఞప్తి చేశారు.

# సంగం బ్యారేజీపై సీసీ కెమెరాల నిఘా

**సంగం సెప్టెంబర్ 15 (వార్తాప్రభ ప్రతినిధి)** సంగం బ్యారేజీ వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును ఇరిగేషన్ డీఈఈ జయరామిరెడ్డి మంగళవారం పరిశీలించారు. ఏఈ ప్రసాద్‌తో కలిసి బ్యారేజీ పరిసరాల్లో ఏర్పాటు చేసిన కెమెరాల పనితీరును తనిఖీ చేశారు. బ్యారేజీ పరిసరాల్లో మొత్తం 8 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు, దొంగతనాలను నివారించడంతో పాటు బ్యారేజీపై నిరంతర నిఘా ఉంచేందుకు వీటిని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పొదలకూరు, చేజర్ల వైపు నుంచి బ్యారేజీపైకి వచ్చే వారి కదలికలను, సంగం వైపు నుంచి వచ్చే రాకపోకలను కెమెరాల ద్వారా పర్యవేక్షించనున్నారు. అనధికార వ్యక్తులు, ఆకతాయిల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచడంతో బ్యారేజీ భద్రత మరింత పటిష్టం కానుందని డీఈఈ జయరామిరెడ్డి తెలిపారు. కెమెరాల రీఛార్జ్, కనెక్షన్ తదితర అంశాలను ప్రతి ఆరు నెలలకు ఒకసారి పర్యవేక్షించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.



# ఒక రోజు ముందే విచారణకు హాజరైన నందన

**- 16న విచారణకు హాజరు కావాల్సి ఉండగా ఒకరోజు ముందుగానే..**

**- బాధితులు, మీడియా కంట పడకుండా హాజరైన యూట్యూబర్**

**- నాకు సంబంధం లేదు.. నా భర్తను అడగండి అంటూ నందన పాత పాట**



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 15(వార్తా ప్రభ ప్రతినిధి):** లండన్ లో ఉద్యోగాలు, స్పాన్సర్ షిప్ లు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు వసూలు చేసినట్లు నమోదైన కేసులో నిందితురాలు, యూట్యూబర్ రమానందన మంగళవారం మరోసారి విచారణ నిమిత్తం ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ కు హాజరయ్యారు. ఛీటింగ్ కేసులో ఏ2గా ఉన్న యూట్యూబర్ నందన ఈ నెల 8న మొదటి సారి ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ కు విచారణ నిమిత్తం న్యాయవాదులతో కలిసి వచ్చారు. పోలీసుల విచారణలో నందన నుంచి సంతృప్తికరమైన సమాధానాలు రాకపోవడంతో ఈ నెల 16న మరోసారి విచారణకు హాజరు కావాలని నోటీసు ఇచ్చారు. అయితే ఒకరోజు ముందుగానే ఆమె న్యాయవాదులతో కలిసి విచారణకు విచ్చేశారు. మూడు గంటల పాటు కొనసాగిన విచారణలో పోలీసులకు సహకరించలేదని సమాచారం. డెస్టినీ కన్సల్టెన్సీ కార్యకలాపాలు, విదేశీ ఉద్యోగాల పేరుతో చేసిన మోసాలపై ప్రశ్నించగా ఈ వ్యవహారాలు తనకు తెలియదని, తన భర్త మధుకర్ చూసుకునేవాడని చెప్పినట్లు సమాచారం. విచారణలో పలు కీలక ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు రాకపోవడంతో ఆమె భర్త మధుకర్ ను విచారణకు పిలిచే అవకాశం ఉంది. అయితే నందన లండన్ వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని కోరినట్లు సమాచారం. తనను లండన్ పంపితే ఈ కేసుతో సంబంధం ఉన్న భర్త మధుకర్ ను నెల రోజుల్లో భారత్ కు పంపిస్తానని చెప్పినట్లు తెలిసింది. డెస్టినీ కన్సల్టెన్సీ కార్యకలాపాలపై పూర్తిస్థాయిలో విచారించాల్సిన మధుకర్ ను భారత్ కు రప్పించే విషయం, నందన లండన్ వెళ్లేందుకు అనుమతులపై పోలీసులు న్యాయ సలహా కోరుతున్నట్లు సమాచారం. కాగా ఈ కేసులో బాధితులు, మీడియా కంటపడకుండా ఉండేందుకు గుట్టుచప్పుడు కాకుండా ఒకరోజు ముందుగానే రమానందన విచారణకు హాజరయ్యేందుకు పోలీసులు సహకరించారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పోలీసులు బాధితుల పక్షాన నిలవకుండా నిందితురాలు నందనకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. దీంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, గుజరాత్, కర్ణాటక తదితర రాష్ట్రాలకు చెందిన బాధితులు బుధవారం ఇబ్రహీంపట్నం చేరుకుని తమకు జరుగుతున్న అన్యాయాన్ని మీడియాకు వివరించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## రక్తదానం అనేది ప్రాణాలను కాపాడే గొప్ప మహత్కార్యం

**వినాయక చవితి సందర్భంగా పెరుమాళ్ళపాడులో రక్తదానం చేస్తున్న యువకులు**





**చేజర్ల సెప్టెంబర్ 15 (వార్తాప్రభ)** చేజర్ల మండలంలోని పెరుమాళ్ళపాడు గ్రామంలో మంగళవారం పలసాని ఈశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో కిలారి జయరామయ్య వేమన మహేష్ మాదాల మహేంద్ర కమ్మ శ్రీనివాసులు కిలారి రమేష్ కిలారి సునీల్ యాకసిరి వెంకటేశ్వర్లు ఎస్ జనార్దన్ అనే వారు పెరుమాళ్ళపాడు యువత సహాయం సహకారంతో వినాయక చవితి సందర్భంగా రెడ్ క్రాస్ వారి తరపున రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి పెద్ద మొత్తంలో యువకులు రక్తదానం చేయడం జరిగినది.ఈ సందర్భంగా గ్రామ నాయకులు పలసాని ఈశ్వర్ రెడ్డి మరియు వేమన మహేష్ మాట్లాడుతూ వినాయక చవితి పర్వదినం సందర్భంగా బ్లడ్ క్యాంప్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.ప్రస్తుత కాలంలో మారిన అలవాట్లతో వయసుతో సంబంధం లేకుండా వ్యాధుల బారిన పడేవారు కొందరు అయితే యాక్సిడెంట్ బారిన పడి ప్రమాదాల బారిన పడేవారు ఇంకొందరు.ముఖ్యంగా 20 నుండి 30 సంవత్సరాల వయస్సు గల యువతీ యువకులు కూడా అనేక ప్రమాదకరమైన వ్యాధుల బారిన పడుతున్నారు.రక్తదానం అనేది ప్రాణాలను కాపాడే గొప్ప మహత్కార్యం అని వారు పేర్కొన్నారు.మనం ఇచ్చే రక్తంతో ఎవరో ఒకరి ప్రాణం నిలబడుతుంది" అనే బలమైన నమ్మకం ప్రతి ఒక్కరికి ఉండాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సిబ్బంది చేజర్ల మండల లింకు వర్కర్ ఆత్మకూరు శశికళ కామంచి వెంగబాబు ఈ బ్లడ్ క్యాంపులో రక్తం సేకరించారు.

## మాజీ డిప్యూటీ సీఎం ఆళ్ల నాని మృతిపై ఎమ్మెల్యే యార్లగడ్డ దిగ్భ్రాంతి

**ఆళ్ల నాని మరణం కలచివేసిందన్న ఎమ్మెల్యే యార్లగడ్డ**

**ఆళ్ల నాని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపిన యార్లగడ్డ**



**గన్నవరం, సెప్టెంబర్ 15:(వార్తా ప్రభ ప్రతినిధి)** మాజీ ఉప ముఖ్యమంత్రి, టీడీపీ నాయకుడు ఆళ్ల కాళీ కృష్ణ శ్రీనివాస్ (ఆళ్ల నాని) ఆకస్మిక మరణంపై ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన గుండెపోటుతో కన్నుమూయడం తనను ఎంతగానో కలచివేసిందని ఒక ప్రకటన ద్వారా తెలిపారు. గన్నవరం నియోజకవర్గంతో ఆళ్ల నానికి ఉన్న అనుబంధం, వ్యక్తిగతంగా తనపై ఆయన చూపించిన ఆప్యాయతానురాగాలు ఎప్పటికీ మరువలేనివని యార్లగడ్డ గుర్తుచేసుకున్నారు. పదవుల్లో ఉన్నా లేకపోయినా అందరితో ఎంతో సౌమ్యంగా, ఆత్మీయంగా మెలిగే స్వభావం ఆళ్ల నాని సొంతమని కొనియాడారు. ఒక మంచి మనసున్న ప్రజా నాయకుడితో పాటు, ఆత్మీయుడిని కోల్పోవడం పూడ్చలేని లోటని ఆయన విచారం వ్యక్తం చేశారు. ఆళ్ల నాని ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించిన యార్లగడ్డ, ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని ఆయన కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తూ ఘన నివాళులు అర్పించారు.

## కృష్ణా యూనివర్సిటీలో ఘనంగా ఇంజనీర్స్ డే వేడుకలు

**విశ్వేశ్వరయ్య సేవలు చిరస్మరణీయం: వీసీ ఆచార్య కె. రాంజీ**

**మచిలీపట్నం సెప్టెంబర్ 15:(వార్తా ప్రభ ప్రతినిధి)** భారతరత్న, ప్రఖ్యాత భారతీయ ఇంజనీర్ సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని సెప్టెంబర్ 15న నిర్వహించే ఇంజనీర్స్ డే వేడుకలను కృష్ణా విశ్వవిద్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కృష్ణా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో



ప్రిన్సిపల్ ఆచార్య వై.కె. సుందరకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి వర్సిటీ ఉపకులపతి ఆచార్య కె. రాంజీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వీసీ ఆచార్య కె. రాంజీ మాట్లాడుతూ సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య విద్యా, ఇంజనీరింగ్ రంగాల్లో విశేష సేవలు అందించి దేశ అభివృద్ధికి తనదైన ముద్ర వేశారని కొనియాడారు. ఆయన సేవలకు దేశవ్యాప్తంగా విశేష గుర్తింపు లభించిందన్నారు. కర్ణాటకలోని బెలగావిలో ఉన్న విశ్వేశ్వరయ్య టెక్నలాజికల్ యూనివర్సిటీకి ఆయన పేరు పెట్టడం ఆయన ప్రతిభకు లభించిన గౌరవానికి నిదర్శనమన్నారు.వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఎన్. ఉష మాట్లాడుతూ వ్యవసాయ, సాగునీటి రంగాల అభివృద్ధికి విశ్వేశ్వరయ్య అందించిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు. దేశ నిర్మాణంలో ఇంజనీర్ల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సీడీసీ డీన్ ఆచార్య ఆర్. కిరణ్ కుమార్, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డా. ఎం. బాబు రెడ్డి, డా. ఆర్. విజయకుమారి, ఇంజనీరింగ్ కళాశాల బోధనా సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ స్టేషన్ల అభ్యంతరాలపై నేడు సమావేశం



ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 15 (వార్తా ప్రభ ప్రతినిధి): ఇబ్రహీంపట్నం మండల ప్రాదేశిక నియోజకవర్గాల పోలింగ్ స్టేషన్ల వివరాలను మండల పరిషత్ కార్యాలయం నోటీసు బోర్డులో మంగళవారం ప్రదర్శించారు. దీనిపై అభ్యంతరాలు, సూచనల కోసం ఈనెల 16న ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో డి.శకుంతల తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని అన్ని రాజకీయ పార్టీల అధ్యక్షులు హాజరుకావాలని కోరారు.

# సంగం బ్యారేజీని సందర్శించిన డిఎస్పీ



సంగం సెప్టెంబర్ 15(వార్తాప్రభ ప్రతినిధి) సంగం బ్యారేజి ను డిఎస్పీ వెంకటేశ్వర్లు సంగం సీఐ శ్రీనివాస రెడ్డి ఎస్సై భోజ్యా నాయక్ తో కలిసి సందర్శించారు. మూడో రోజు వినాయక నిమజ్జనాలు జరగనున్న నేపథ్యం లో బ్యారేజీ వద్ద నిమజ్జనానికి సంబంధించి వసతులను పరిశీలించారు. బ్యారేజి వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా వినాయక నిమజ్జనాలు నిర్వహిస్తామని తెలిపారు. నిమజ్జనాలు నిర్వహించే ప్రాంతాలలో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో సిబ్బంది పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావంతో వరి నార్లు వేయొద్దు



సంగం సెప్టెంబర్ 15(వార్తాప్రభ ప్రతినిధి) అన్నారెడ్డిపాలెం సంగం గ్రామాల్లో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి శశిధర్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోవూరు ఏడీఏ అనిత పాల్గొని రైతులకు ఎల్‌నినో ప్రభావంపై అవగాహన కల్పించారు. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని సోమశిల జలాశయంలోనూ సాగుకు సరిపడా నీటి లభ్యత లేని పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులు వరి సాగుకు నార్లు పోయవద్దని సూచించారు. బోర్ల కింద కూడా వరి నార్లు పోయకుండా ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ జిల్లా వ్యవసాయ అధికారి ఇచ్చిన సూచనలను రైతులు పాటించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకురాలు మాధురి రైతులు పాల్గొన్నారు.

# పోషకాహారంపై అవగాహన కల్పించిన అధికారులు



సంగం సెప్టెంబర్ 15(వార్తాప్రభ ప్రతినిధి) ఆత్మకూరు ప్రాజెక్టు పరిధిలోని సంగం సెక్టార్ జెండాదిబ్బ ఎస్టీ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం 9వ రాష్ట్రీయ పోషణ్ మాహ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రాజెక్టు సీడీపీఓ ఆదేశాల మేరకు జరిగిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి పాల్గొని పోషకాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. పౌష్టికాహార ప్రాముఖ్యతను ప్రజలకు చేరువ చేసేందుకు ముద్రిత సామాజిక మాధ్యమాలు టీవీ ప్రకటనలు రేడియో తదితర మార్గాల ద్వారా నెల రోజుల పాటు విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఆహార వైవిధ్యం ప్రొటీన్ అధికంగా ఉండే ఆహార పదార్థాలు ప్రాంతీయ వంటకాలు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా 'నా ఆరోగ్యకరమైన ప్లేటు' పేరిట ప్రత్యక్ష ప్రదర్శన నిర్వహించారు. పప్పులు చిరుధాన్యాలు ఆకుకూరలు కూరగాయలు పండ్లు పాలు గుడ్లు తదితరాలను కలిపి సమతుల్య ఆహారాన్ని ఎలా తీసుకోవాలో వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాలు పాఠశాలల్లో నూనె చక్కెర ఉప్పును పరిమితంగా వినియోగించడంపై అవగాహన సామగ్రిని ప్రదర్శించారు. అదేవిధంగా టీహెచ్‌ఆర్ వంటకాలు హెచ్‌సీఎం మెనూ స్థానిక ఆహార పదార్థాలతో తయారు చేసిన ప్రాంతీయ వంటకాలను ప్రదర్శించారు. ప్రొటీన్, ఐరన్ అధికంగా ఉండే ఆహార పదార్థాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పోషణ ప్లేట్లతో పాటు స్థానిక పోషక వంటకాల ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు లావణ్య లీలమ్మ చెంచమ్మ రాధమ్మ వెంకమ్మ లబ్ధిదారులు పాల్గొన్నారు.

# విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

## ఘనంగా 18వ పీఎస్‌సీఎంఆర్ కాలేజ్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు





విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 15 :(వార్త ప్రభ ప్రతినిధి) విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా వస్తున్న అంశాలతో పాటుగా నైపుణ్యాలను పెంపొందించుకున్నప్పుడే విజయాలను సాధించగలరని ప్రముఖ పారిశ్రామికవేత్త తొండెపు హనుంతరావు అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ 18వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు, ఇంజనీర్స్ డే వేడుకలు ఆ కళాశాల ప్రాంగణంలో మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన తొండెపు హనుమంతరావు మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర శ్రమ వంటి అంశాలు ఎటువంటి కష్టమైన విజయాన్ని అయినా అందిస్తాయన్నారు. ఆ దిశగా విద్యార్థులు అడుగులు వేయాలన్నారు. విద్యార్థులుఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని వాటిని సాధించేందుకు పాటుపడాలన్నారు. కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు చలవాది మల్లికార్జునరావు, చిట్టా అమర్‌సుధీర్‌లు మాట్లాడుతూ ఏఐ వంటి నూతన అంశాలు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. విద్యార్థులు తమతమ రంగాల్లో వస్తున్న మార్పులను గమనిస్తూ వాటిపై పట్టు సాధించాలన్నారు. ఉపాధి అవకాశాలను ప్రభావితం చేసే అంశాల్లో ప్రావీణ్యం సంపాదించాలన్నారు. ఈ సందర్భంగా వివిధ అంశాల్లో విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులను అందించారు. అలాగే విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతికాంశాలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల సహాయ కార్యదర్శి గ్రంధి పవనకుమార్, కోశాధికారి కాజా రాఘవయ్య ప్రసంగించగా, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ శరవణకుమార్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

# డొక్కా సీతమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 300 మందికి అన్న దానం.



విజయవాడ, సెప్టెంబర్ 15:(వార్తా ప్రభ ప్రతినిధి): సెంట్రల్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బోండా ఉమామహేశ్వరరావు ఆశీస్సులతో పాత గవర్నమెంట్ హాస్పిటల్ లో డొక్కా సీతమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 300 మందికి పైగా అన్నదాన కార్యక్రమం చేయడం జరిగినది. ఆకలితో ఉన్నవారికి భోజనం పెట్టడంలో ఉన్న సంతోషము ఎందులోను రాదని డొక్కా సీతమ్మ చారిటబుల్ ట్రస్ట్ కమిటీ మెంబర్స్ చెప్పారు. ఆ విష్ణుమూర్తె వచ్చి భోజనం చేస్తున్నట్టు ఉందని మేము వంట చేయడానికి పడ్డ కష్టం అంతా ఆకలితో ఉన్నవాళ్లు వచ్చి తిన్నప్పుడు మర్చిపోతున్నామని డొక్కా సీతమ్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు అవుటుపల్లి విజయ కుమారి చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సంసాని విజయలక్ష్మి,గుబ్బల జ్యోతిశ్వరి, రాచూరి జయరాజ్, కానుమూరి దుర్గ,లక్ష్మి ఇంకా కమిటీ మెంబర్స్ పాల్గొన్నారు.

# రజక వీధిలో చిన్నారులతోఘనంగా వినాయక చవితి వేడుకలు



ఆగిరిపల్లి: సెప్టెంబర్ 15:(వార్తా ప్రభ ప్రతినిధి)ఏలూరు జిల్లా, నూజివీడు నియోజకవర్గం ఆగిరిపల్లి రజక వీధిలో వినాయక చవితి వేడుకలను చిన్నారులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వినాయక విగ్రహానికి చిన్నారులు పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా చిన్నారులు, విద్యాబుద్ధులు ఆయురారోగ్యాలు స్వామివారు కలగజేస్తారని ఆశిస్తూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. వీధిలో భక్తి వాతావరణం నెలకొంది.

# యువనేత నారా లోకేష్ కు మద్దతుగా తరలిరండి..

## పెడన మండలంలో పర్యటించిన రొండి కృష్ణా యాదవ్



పెడన సెప్టెంబర్ 15:(వార్తా ప్రభ ప్రతినిధి)యువనేత భావి ముఖ్యమంత్రి నారా లోకేష్ పెడన పర్యటన విజయవంతం చేయాలని ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రొండి కృష్ణా యాదవ్ అన్నారు. లోకేష్ పర్యటన నేపథ్యంలో శాసనసభ్యులు కృష్ణప్రసాద్ ను పెడనలో కలుసుకొని కార్యక్రమ విజయవంతానికి తీసుకోవలసిన చర్యల గురించి చర్చించారు. లోకేష్ పర్యటన విజయవంతం చేయాలని ముఖ్యంగా యాదవ సామాజిక వర్గ నాయకులకు కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. బీసీలకు ఆదినుంచి టిడిపి పెద్దపీట వేస్తున్న సంగతిని ఆయన గుర్తు చేశారు. బీసీలకు సామాజికపరంగా న్యాయం జరగాలంటే కూటమి ప్రభుత్వం కు స్థానిక ఎన్నికల్లో మద్దతు పలకాలని కోరారు. అభివృద్ధి తోపాటు సంక్షేమాన్ని కూడా సమపాళ్ళలో అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వం కు ప్రతి ఉక్కరు మద్దతు ఇవ్వవలసిన అవసరం ఉందని కృష్ణా యాదవ్ అన్నారు.

# వరిలో కాండం తొలుచు పురుగుపై రైతులు అప్రమత్తం ఉండాలి

## కొత్త ఈదరలో 'పొలం పిలుస్తోంది'



ఆగిరిపల్లి: సెప్టెంబర్ 15:(వార్తా ప్రభ ప్రతినిధి) ఏలూరు జిల్లా, నూజివీడు నియోజకవర్గం ఆగిరిపల్లి మండలంలోని,కొత్త ఈదర రైతు సేవా కేంద్రం పరిధిలో మంగళవారం మండల వ్యవసాయాధికారి జె. భవాని ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వరిలో కాండం తొలుచు పురుగు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పురుగు ఆశిస్తే తెల్ల కంకులు ఏర్పడి దిగుబడి తగ్గుతుందని తెలిపారు. పంట దశను బట్టి సిఫారసు చేసిన పురుగుమందులు వినియోగించాలని సూచించారు. వ్యవసాయ శాఖ పథకాలు పొందేందుకు రైతు విశిష్ట సంఖ్య (ఫార్మర్ ఐడీ) తప్పనిసరిగా పొందాలని, రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

# ఆగిరిపల్లిలో వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం



ఆగిరిపల్లి: సెప్టెంబర్ 15:(వార్తా ప్రభ ప్రతినిధి) ఏలూరు జిల్లా, నూజివీడు నియోజకవర్గం, ఆగిరిపల్లి మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం బుధవారం (16న) నిర్వహించనున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు బెజవాడ రాంబాబు తెలిపారు. ఆగిరిపల్లిలోని పొన్నం కళ్యాణ మండపంలో సాయంత్రం 3 గంటలకు సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. నూజివీడు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ముఖ్య అతిథిగా పాల్గొననున్నట్లు తెలిపారు. జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచులు, బ్యాంకు ప్రెసిడెంట్లు, మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని బెజవాడ రాంబాబు కోరారు.

# నారా లోకేష్ పర్యటనను విజయవంతం చేయండి

## కార్యకర్తలకు వేద వ్యాస్ పిలుపు



పెడన సెప్టెంబర్ 15:(వార్తా ప్రభ ప్రతినిధి)రాష్ట్ర విద్యాశాఖ మంత్రి టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ పెడన పర్యటన విజయవంతం చేయాలని టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేద వ్యాస్ కోరారు. ఈ మేరకు అయన ఉక పత్రికా ప్రకటన చేసారు. ఈ నెల 17 న లోకేష్ పెడన కు విచ్చేస్తున్న సంగతి తెలిసిందే. ఉదయం 10 గంటలకు పట్టణంలోని తామర చెరువు వద్ద లోకేష్ కి ఘన స్వాగతం పలిపి అక్కడ నుంచి ర్యాలీగా మచిలీపట్నం పెడన ప్రధాన రహదారి మీదగా ఫ్లైఓవర్ ఎదురుగా ఉన్న బేరాక ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదిక వద్దకు చేరుకుంటారని తెలిపారు. అభివృద్ధి తోపాటు సంక్షేమాన్ని కూడా సమపాళ్ళలో అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వం కు ప్రతి ఉక్కరు మద్దతు ఇవ్వవలసిన అవసరం ఉందన్నారు.

# సాగర తీర మహాగణపతిని దర్శించుకున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

## పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికిన వేద పండితులు.



మచిలీపట్నం సెప్టెంబర్ 15:(వార్తా ప్రభ ప్రతినిధి) మచిలీపట్నం మంగినపూడి సాగర తీరంలో కొలువుదీరిన 63 అడుగుల సప్తమృత్తిక విజయ మహాగణపతిని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాగరతీరం భక్తిశ్రద్ధలతో సందడిగా మారింది. మంగినపూడి సాగర తీరానికి చేరుకున్న గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు వేద పండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ మహాగణపతిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు మంత్రోచ్చారణల మధ్య ఆశీర్వచనాలు అందించారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు రాష్ట్ర ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు స్వాగతం పలికారు. భారీ విగ్రహాన్ని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో మంగినపూడి సాగర తీరం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

# డాబాపై నుంచి పడి మహిళ మృతి



ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 15 (వార్తా ప్రభ ప్రతినిధి): ఉతికిన బట్టలు ఆరేసేందుకు రెండస్తుల డాబాపైకి ఎక్కిన మహిళ ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందిన ఘటన మండలంలోని కిలేశపురంలో సోమవారం జరిగింది. సేకరించిన వివరాల మేరకు గ్రామంలోని ఎస్టీ ఏరియాకు చెందిన బాణావత్ వాలి (60) బట్టలు ఉతికి ఆరేసేందుకు తన రెండస్తుల డాబాపైకి ఎక్కింది. బట్టలు ఆరేసే తాడు లూజుగా ఉండటంతో గట్టిగా బిగించేందుకు ఇంటికి ఉన్న పిట్టగోడపైకి ఎక్కింది. తాడును గట్టిగా లాగుతున్న క్రమంలో తాడుతెగి పట్టుతప్పి 30అడుగుల కిందకు పడిపోయింది. పడిన సమయంలో ప్రమాదాన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు హుటాహుటిన తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. పోలీసులు పోస్టు మార్టం అనంతరం మృత దేహాన్ని బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఎన్ఆర్ఐ గిరిబాబుకు అభినందనల వెల్లువ




విస్సన్నపేట సెప్టెంబర్ 15:(వార్తా ప్రభ ప్రతినిధి)స్థానిక మండల కేంద్రంలో స్వచ్ఛ కోనేరు అభివృద్ధిలో భాగంగా కూటమి ప్రభుత్వ పరిపాలనలో 50 లక్షల రూపాయలతో విస్సన్నపేట మండలానికే ఐకాన్ గా వాకర్స్ కు మౌలిక వసతులు అందించేందుకు శ్రీకారం చుట్టడం అందరికీ తెలిసిందే. ఎన్ఆర్ఐ వల్లభనేని గిరిబాబు ఇప్పటికే సిద్ధమవుతున్న వాకింగ్ ట్రాకర్ ప్రీమిసెస్ లో ప్రశాంతంగా వాకర్లు తాము నడిచేందుకు కోనేరు కట్టపై ఐరన్ పైపులతో కంచె ఏర్పాటు చేసేందుకు మూడు లక్షల రూపాయలు వితరణ అందించటం సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు రాజకీయాలకతీతంగా ఆయన తీసుకున్న నిర్ణయం చెరువు కట్ట పైన నడిచే వాకర్స్ కు బయట నుండి వాహనాలు మరియు ఆవులు గేదెలు మేకలు గొర్రెలు వంటి పశుసంపద వచ్చి ఇబ్బంది పెట్టకుండా ఉండేందుకు ప్రాణ రక్షణలో భాగ చర్యలు తీసుకోవడం పట్ల అందరూ అభినందిస్తున్నారు

# జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు జగదీశ్వరరావుకు ఘన సత్కారం

గన్నవరం, సెప్టెంబర్ 15:(వార్తా ప్రభ ప్రతినిధి)గన్నవరం మండలం ?గొల్లనపల్లిలోని పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జగదీశ్వరరావు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికై అవార్డు అందుకోవడం పట్ల గన్నవరం సాహితీ సంగమం, పాఠశాల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో మంగళవారం పాఠశాల ఆవరణలో సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకలో ఆయనను శాలువా, పూలమాలలు, మెమొంటోతో ఘనంగా సత్కరించారు. ?ఈ సందర్భంగా సాహితీ సంగమం అధ్యక్షులు కోడే యామిని మాట్లాడుతూ, ఎంతోమంది విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చేలా తీర్చిదిద్దిన జగదీశ్వరరావు మాస్టారు ఈ పురస్కారానికి తగిన వ్యక్తి అని అభినందించారు. పాఠశాల ప్రాంగణంలో పచ్చదనం నింపి ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు పరిశుభ్రతను నెలకొల్పడంలో ఆయన చూపిన చొరవ అభినందనీయమని కొనియాడారు. ?సాహితీ సంగమం ప్రధాన కార్యదర్శి ఉడతా రామకృష్ణ మాట్లాడుతూ, పూర్వ విద్యార్థుల భాగస్వామ్యంతో పాఠశాలలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు సంగమం బాధ్యులు పిల్లి మహేష్ మాట్లాడుతూ... సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి (ఇంజనీర్స్ డే) రోజే ఈ కార్యక్రమం జరగడం విశేషమని, విశ్వేశ్వరయ్య నీతి నిజాయితీలకు, అంకితభావానికి నిలువెత్తు రూపమని, ఆయన మహోన్నత జీవితాన్ని విద్యార్థులందరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ?ఈ కార్యక్రమంలో బిబిగూడెం మాజీ సర్పంచ్ తమ్మిశెట్టి రఘుబాబు, సాహితీ సంగమం ప్రతినిధులు ధనియాల అప్పారావు, స్వామి, పూర్వ విద్యార్థి శీలం మురళీతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.





# విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

## ఘనంగా 18వ పీఎస్‌సీఎంఆర్ కాలేజ్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు







విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 15 :(వార్త ప్రభ ప్రతినిధి) విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా వస్తున్న అంశాలతో పాటుగా నైపుణ్యాలను పెంపొందించుకున్నప్పుడే విజయాలను సాధించగలరని ప్రముఖ పారిశ్రామికవేత్త తొండెపు హనుంతరావు అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ 18వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు, ఇంజనీర్స్ డే వేడుకలు ఆ కళాశాల ప్రాంగణంలో మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన తొండెపు హనుమంతరావు మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర శ్రమ వంటి అంశాలు ఎటువంటి కష్టమైన విజయాన్ని అయినా అందిస్తాయన్నారు. ఆ దిశగా విద్యార్థులు అడుగులు వేయాలన్నారు. విద్యార్థులుఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని వాటిని సాధించేందుకు పాటుపడాలన్నారు. కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు చలవాది మల్లికార్జునరావు, చిట్టా అమర్‌సుధీర్‌లు మాట్లాడుతూ ఏఐ వంటి నూతన అంశాలు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. విద్యార్థులు తమతమ రంగాల్లో వస్తున్న మార్పులను గమనిస్తూ వాటిపై పట్టు సాధించాలన్నారు. ఉపాధి అవకాశాలను ప్రభావితం చేసే అంశాల్లో ప్రావీణ్యం సంపాదించాలన్నారు. ఈ సందర్భంగా వివిధ అంశాల్లో విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులను అందించారు. అలాగే విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతికాంశాలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల సహాయ కార్యదర్శి గ్రంధి పవనకుమార్, కోశాధికారి కాజా రాఘవయ్య ప్రసంగించగా, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ శరవణకుమార్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

## అక్రమ మద్యం కేసులో రిమాండ్ పొడిగింపు

**విజయవాడ లీగల్,సెప్టెంబర్ 15 (వార్తాప్రభ) :** అక్రమ మద్యం కేసులో ఎ9 నిందితుడు తుకేకుల ఈశ్వర్ కిరణ్ కుమార్ రెడ్డి రిమాండ్ మంగళవారం ముగిసింది. దీంతో గుంటూరు జైలు నుండి పోలీసులు వర్చువల్‌గా ఎసిబి న్యాయస్థానంలో హాజరుపరిచారు. విచారణ జరిపిన గౌరవ న్యాయమూర్తి శ్రీ ఎల్.తేజోవతి ఈనెల 29వ తేదీ వరకు రిమాండ్ విధించారు.

## 1 వ అంగన్వాడీ కేంద్రం లో పోషణ మాసం వేడుకలు..



**పెనుగంచిప్రోలు,సెప్టెంబర్ 15 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా చిల్లకల్లు ప్రాజెక్ట్ ఐ సి డి ఎస్ సి డి పి ఓ సత్యవతి ఆదేశాల మేరకు మంగళవారం పెనుగంచిప్రోలు గ్రామంలోని పోషణ మాసం కార్య క్రమం లో భాగంగా పెనుగంచి ప్రోలు. 1వ అంగన్వాడి కేంద్రం నందు సూపర్వైజర్ రజనీ జ్వాలా ఆధ్వర్యంలో పోషణ మాసం వేడుకలు నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమంలో గర్భవతులకు, బాలింతలకు 7 నెలల నుంచి మూడు సంవత్సరాల లోపు పిల్లల యొక్క తల్లులకు ఆరోగ్యంగా ఉండాలంటే తగిన పోషకాహారం తీసుకోవాలని ఆకుకూరలు మునగాకు గుడ్డు పాలు రాగి జావా, బొప్పాయి, దానిమ్మ పండ్లు తీసుకోవటం వల్ల బిడ్డ ఆరోగ్యంగా ఉంటారు హిమోగ్లోబిన్ శాతం పెరుగుతుందని రజిని గర్భవతులకు, బాలింతలకు, తల్లులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో లబ్ధిదారులు, తల్లులు సూపర్వైజర్ రజనీ అంగన్వాడి కార్యకర్తలు సహాయకులు పాల్గొన్నారు..

# అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు -మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు

## గంగినేనిలో రూ.1.21 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

**జి.కొండూరు,సెప్టెంబర్ 15 (వార్తాప్రభ) :** గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తున్నట్లు మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు.జి.కొండూరు మండలం గంగినేనిపాలెం గ్రామంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.36 లక్షలతో నిర్మించిన గ్రామీణ ఆరోగ్య కేంద్రాన్ని, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.45 లక్షలతో నిర్మించిన అంతర్గత సిమెంట్ రోడ్లను ఎమ్మెల్యే కృష్ణప్రసాదు మంగళవారం సాయంత్రం ప్రారంభించారు.అలాగే జిల్లా ఖనిజాభివృద్ధి నిధులు రూ.25 లక్షలతో నిర్మించనున్న బీసీ సామాజిక భవనానికి, రూ.15 లక్షలతో చేపట్టనున్న లో లెవల్ వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.మొత్తంగా గ్రామంలో రూ.1.21 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గంగినేనిపాలెంలో రూ.25 లక్షల అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. పల్లె పండుగ రెండో విడత కార్యక్రమం ద్వారా రూ.45 లక్షలతో సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు.గ్రామంలోని వాగు అభివృద్ధికి రూ.5 లక్షలు కేటాయించి పనులు చేపట్టినట్లు తెలియజేశారు.అకాల వర్షాలు, వరదల కారణంగా ముంపునకు గురైన గంగినేనిపాలెం గ్రామంలోని 100





కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందించడంతో పాటు నిత్యావసర సరుకులు అందించినట్లు ఎమ్మెల్యే కృష్ణప్రసాదు తెలిపారు.జింకల వెంకటేశ్వరరావు గేదె మృతి చెందడంతో రూ.50 వేల, సాగర్ల ముత్యాలు గారి మేకలు మృతి చెందడంతో రూ.1.50 లక్షల, నన్నెబోయిన వెంకటేశ్వరరావు ప్రమాదవశాత్తు మరణించడంతో ఆయన కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించినట్లు వివరించా రు. 2025 సంవత్సరంలో ఐదుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున మొత్తం రూ.25 వేల, 2026 సంవత్సరంలో ముగ్గురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున మొత్తం రూ.15 వేల ఆర్థిక సహాయం అందించినట్లు వెల్లడించారు.తల్లికి వందనం పథకం ద్వారా 437 మంది లబ్ధిదారులకు రూ.58,99,500 అందుతున్నట్లు ఎమ్మెల్యే వివరించారు.మైలవరం నియోజకవర్గ సమగ్రా భివృద్ధే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు స్పష్టంచేశారు.ఈ కార్యక్ర మంలో ఎంపీడీవో బొజ్జగాని శ్రీనివాసరావు, తహశీల్దార్ రిబ్కా రాణి,తెదేపా మండల పార్టీ అధ్యక్షులు వేములకొండ వెంకటేశ్వరరావు, ఐడిసి డైరెక్టర్ అంకెం ఇందిరా ప్రియదర్శిని, మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి అక్కల గాంధీ,ఏఎంసీ మాజీ చైర్మన్ వుయ్యూరు వెంకట నరసింహారావు, గ్రామ మాజీ సర్పంచ్ మంగళంపాటి వెంకటేశ్వరరావు,జనసేన పార్టీ జి.కొండూరు మండల అధ్యక్షుడు యర్రబోలు నరసింహారావు, వైద్య ఆరోగ్య సిబ్బంది,కూటమి నాయకులు, కార్యకర్తలు,అధికారులు, గ్రామస్థు లు తదితరులు పాల్గొన్నారు.

## ఇంజనీర్లే దేశ ప్రగతికి వెన్నుముక - సివిల్ ఇంజనీర్ యాడ్ల శ్రీ రాంబాబు





**గుడివాడ,సెప్టెంబర్ 15 (వార్తాప్రభ) :** విద్యార్థులు భవిష్యత్తులో ఎదురయ్యే సాంకేతిక సవాళ్లను అధిగమించేందుకు ప్రాక్టికల్ నాలెడ్జ్, కమ్యూనికేషన్ స్కిల్స్, టీం వర్క్, మరియు నిరంతర అభ్యాసం పై దృష్టి పెట్టాలని అక్కినేని నాగేశ్వరరావు కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ లో "భారతరత్న" సర్ శ్రీ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని ఇంజనీర్సడే వేడుకలను ముఖ్యఅతిథిగా విచ్చేసిన సివిల్ ఇంజనీర్ యాడ్ల శ్రీ రాంబాబు సీనియర్ సెక్షన్ ఇంజనీరింగ్ వర్క్స్ సౌత్ సెంట్రల్ రైల్వే ,గుడివాడ విద్యార్థులు ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా దేశ నిర్మాణంలో ఇంజనీర్ల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు ఇంజనీరింగ్ విద్యార్థులు కేవలం విద్యా ప్రమాణాలకే పరిమితం కాకుండా సాంకేతిక పరిజ్ఞానం, నూతన ఆలోచనలు, సమస్య పరిష్కారం నైపుణ్యాలు , క్రమశిక్షణ మరియు సామాజిక బాధ్యతలను పెంపొందించుకోవాలని సూచించారు. దేశ మౌలిక వసతులు అభివృద్ధిలో ఇంజనీర్ల కీలక పాత్ర పోషిస్తున్నారని ముఖ్యంగా సివిల్ ఇంజనీరింగ్ రంగంలో రహదారులు,రైల్వే ప్రాజెక్టులు , భవనాలు నీటి వనరులు వంటి అనేక రంగాల అభివృద్ధికి ఇంజనీర్ల కృషి ఎంతగా అవసరమని వివరించారు. ఇంజనీర్స్ డే వేడుకల్లో భాగంగా విద్యార్థులు ఇంజనీరింగ్ రంగానికి సంబంధించి అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించారు. సర్ శ్రీ మోక్షగుండం విశ్వేశ్వర జీవిత విశేషాలు, ఆయన దేశానికి అందించినటువంటి సేవలు ,ఇంజనీర్ల బాధ్యతలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ,ఇంజనీరింగ్ రంగంలో వస్తున్నటువంటి నూతన మార్పులు తదితర అంశాలను విద్యార్థులు తమ (పి పి టి) ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆరిగా రామారావు మాట్లాడుతూ ఇంజనీర్లే కేవలం సమస్య పరిష్కారాలు చూపేవారు కాదు .ఆవిష్కరణలతో కొత్త ఆలోచనలతో ప్రపంచాన్ని మార్చేవారు అని ఇంజనీరింగ్ యొక్క ప్రాముఖ్యతను వివరించారు . విద్యార్థులు తమ విద్యను సమాజ సంక్షేమానికి ఉపయోగించి దేశ అభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని ఆకాంక్షించారు. కళాశాల అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థి విద్యార్థులు పాల్గొని ఈ కార్యక్రమం ఇంజనీరింగ్ విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యంతో పాటు బాధ్యతాయుతమైన ఇంజనీర్లుగా ఎదగాలని స్ఫూర్తిని నింపిందని పలికారు.

## ఏపీసీపీడీసీఎల్‌లో ఘనంగా ఇంజనీర్స్ డే వేడుకలు

● ఇంజనీర్ల ఆలోచనలు -- దేశ ప్రగతికి పునాదులు: ---- సీఎండీ పి. పుల్లారెడ్డి





**విజయవాడ,సెప్టెంబర్ 15 (వార్తాప్రభ) :** భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఇంజనీర్స్ డే వేడుకలను విజయవాడలోని ఏపీసీపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి. పుల్లారెడ్డి మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఇంజనీర్లకు ఇంజనీర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ, విద్యుత్ సరఫరా నాణ్యతను మెరుగుపరచడం, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడం, సాంకేతిక అభివృద్ధి, విద్యుత్ వ్యవస్థ ఆధునీకరణలో ఇంజనీర్ల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా నూతన సాంకేతికతలు, ఆవిష్కరణలను స్వీకరిస్తూ విద్యుత్ రంగాన్ని మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు విద్యుత్ భద్రత, సరఫరా నాణ్యత, అంతరాయాల నివారణకు ఇంజనీర్లు మరింత అంకితభావంతో పనిచేయాలని సూచించారు. సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య గారి క్రమశిక్షణ, నిజాయితీ, సాంకేతిక నైపుణ్యం, దేశ సేవా స్ఫూర్తి ప్రతి ఇంజనీర్‌కు ఆదర్శమని సీఎండీ పేర్కొన్నారు. ఆయన స్ఫూర్తితో విద్యుత్ రంగ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. "ఇంజనీర్ల ఆలోచనలు -- దేశ ప్రగతికి పునాదులు" అనే స్ఫూర్తితో నూతన ఆలోచనలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని విద్యుత్ రంగంలో మరింత ప్రగతి సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఇంజనీర్‌గా వివిధ విశిష్ట పదవుల్లో సేవలందించి, ప్రస్తుతం ఏపీసీపీడీసీఎల్ సీఎండీగా బాధ్యతలు నిర్వహిస్తున్న పి. పుల్లారెడ్డిను ఇంజనీరింగ్ అధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డైరెక్టర్ టెక్నికల్ ఆవుల మురళీకృష్ణ యాదవ్, డైరెక్టర్ ప్రాజెక్ట్స్ ఒ హెచ్‌ఆర్‌డీ శ్రీ టీవీఎస్ఎన్ మూర్తి, ఇతర ఉన్నతాధికారులు, ఇంజనీర్లు, ఉద్యోగులు పాల్గొని ఇంజనీర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు.

## సబ్సిడీ పై అపరాల విత్తనాలు





**గుంటూరు,సెప్టెంబర్ 15 (వార్తాప్రభ) :** ఈ ఖరీఫ్ సీజన్లో ఎల్ నినో ప్రభావం వలన ఇప్పటి వరకూ పైర్లు వేయని రైతుల కోసం ప్రభుత్వం స్వల్ప కాలిక పంటలైన అపరాలు విత్తనాలు సబ్సిడీ పై రైతులకు ఇవ్వనున్నట్లు గుంటూరు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎన్ మోహన్ రావు అన్నారు, మంగళవారం గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం వట్టి చెరుకూరు గ్రామంలో స్థానిక వ్యవసాయ అధికారిని సి.సునీత అధ్యక్షతన నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమం లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఈ ఖరీఫ్ 2026 సంవత్సరంలో రైతులు ఎవరైనా పంటలు వేయలేకపోయిన వారికీ అపరాల విత్తనాలు అయిన మినుములు, పెసలు మరియు కంది విత్తనాలను సబ్సిడీ మీదే ఇవ్వడం జరుగుతుందన్నారు, కావలసిన రైతులు ఆర్ఎస్కేసిబ్బందిని సంప్రదించి . విత్తనాలు తీసుకోవాలని తెలిపారు,అలాగే రైతులు భాశ్వరం ఎరువులను పైపాటుగా వాడవద్దని, దుక్కుల్లోనే వేసుకోవాలని తెలియజేశారు, వరి పైరులో వచ్చు జింక్ మరియు ఐరన్ డెఫిషియన్సీ గురించి వివరించారు, ప్రతి ఒక్క రైతు కూడా ఫార్మర్ ఐడి నెంబరు కలిగి ఉండాలని తెలియజేశారు,రాబోయే సీజన్లో వ్యవసాయానికి సంబంధించిన ప్రతి కార్యక్రమం కూడా ఫార్మర్ ఐడి నంబర్ ద్వారానే జరుగుతుందని తెలియజేశారు , అందువలన ప్రతి ఒక్క రైతు కూడా ఫార్మర్ ఐడి కలిగి ఉండాలని తెలియజేశారు, అలాగే ప్రతి ఒక్క రైతు కూడా ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని మరియు ఈ కేవైసీ కూడా చేయాలని తెలియజేశారు, అనంతరం, వట్టిచెరుకూరు లోని రైతుసేవా కేంద్రం,మన గ్రోమోర్ సెంటర్,జి డి సి ఎం ఎస్ కేంద్రం ,శ్రీ వెంకటేశ్వర ఫెర్టిలైజర్స్, శ్రీనివాస ఫెర్టిలైజర్స్, చమళ్లమూడిలోని ప్రశాంతి ట్రేడర్స్ అనే ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారుషాప్ లలోని యూరియా,డిఏపి నిల్వలను పరిశీలించారు, మండల వ్యవసాయ అధికారిని సి సునీత మాట్లాడుతూ రైతులందరూ కూడా ఏపీ ఏఐఎంఎస్ 2.0 యాప్ ని ఇన్స్టాల్ చేసుకుని వ్యవసాయానికి సంబంధించిన సమస్త సమాచారాన్ని తెలుసుకోవాలని తెలియజేశారు, ఈ నెల 25 లోపు రైతులందరూ ఈక్రాప్ బుకింగ్ చేయుంచుకోవాలని తెలియ చేశారు , ఈసందర్భంగా గ్రామ రైతులు కొంతమంది వ్యవసాయశాఖ వారిని వరి, మిరప పంటలకు యూరియాను కొంత మేర పెంచి ఎకరానికి కనీసం ఒక బస్తా అయినా అదనంగా ఇవ్వాలని కోరారు . అందుకు అధికారులు స్పందిస్తూ ప్రస్తుతం శాస్త్రవేత్తలు సూచన మేరకు ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం రైతులు వాడాలని, ఎక్కువగా యూరియా, ఇతర కాంప్లెక్స్ ఎరువులు అధికంగా వాడకం వలన భూమి నిస్సత్తువ గా మారటం తో పాటు రైతుకు పెట్టుబడి కూడా పెరుగుతుందని అందువలన రైతులకు మేలు జరగాలంటే ప్రభుత్వం , శాస్త్రవేత్తలు సూచన మేరకు మాత్రమే ఎరువులువాడా లని సూచించారు, కార్యక్రమంలో గ్రామానికి చెందిన రైతులు వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి వైశ్య సంఘం ఏకగ్రీవ ఎన్నిక



**అమలాపురం,సెప్టెంబర్ 15 (వార్తాప్రభ) :** అమలాపురం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి వైశ్య సంఘ సర్వసభ్య సమావేశము మంగళవారం ఉదయం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి వైశ్య సంఘ పచ్చిగోళ్ళ జనార్దన రావు కళ్యాణ మండపంలో అధ్యక్షుడు నంబూరి సత్యనారాయణమూర్తి అధ్యక్షతన జరిగింది ఈ సందర్భంగా సంఘ ఆధ్వర్యంలో గత రెండు సంవత్సరాలలో జరిగిన పలు కార్యక్రమాల గురించి సభ్యులకు ఆయా విభాగాల చైర్మన్లు తెలియజేయగా ఈ రెండు సంవత్సరాల కాలంలో సంఘ జమ ఖర్చులను కోశాధికారి సర్వ సభ్యులకు తెలియజేశారు.... అనంతరం ఇప్పుడున్న కార్యవర్గ కాలపరిమితి ముగిసిన సందర్భముగా సంఘ గడచిన కార్యవర్గ సమావేశంలో ఇదే కార్యవర్గన్ని మరొక రెండు సంవత్సరాలు పొడిగిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని సర్వసభ్య సమావేశంలో కూడా సర్వ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించడంతో అధ్యక్షునిగా నంబూరి సత్యనారాయణమూర్తి, కార్యదర్శిగా నంబూరి నరేష్, కోశాధికారిగా కొమ్మూరి ప్రసాద్ లు మరొక రెండు సంవత్సరాలు ఆ పదవుల్లో కొనసాగనున్నారు ఈ సందర్భంగా వీరిని అమలాపురం ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు యర్రమల్లి విశ్వేశ్వరరావు, కార్యదర్శి నూలు సూరిబాబు, కోశాధికారి శ్రీకాకోలపు రాంపండు లు కండువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలుపుగా కార్యక్రమంలో పాల్గొన్న సర్వ సభ్యులు వీరికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## ప్రబోధానంద సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా శ్రీకృష్ణుని గ్రామోత్సవం





**ఏలూరు జిల్లా/నూజివీడు,సెప్టెంబర్ 15 (వార్తాప్రభ) :** ఏలూరు జిల్లా, నూజివీడు మండలం, రావిచర్ల గ్రామంలో ప్రబోధానంద సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా శ్రీకృష్ణుని గ్రామోత్సవం. ప్రబోధానంద సేవా సమితి సభ్యులు, నూజివీడు మాజీ ఏఎంసీ చైర్మన్ కాపా శ్రీనివాసరావు పర్యవేక్షణలో కులమతాలకు అతీతంగా శ్రీకృష్ణుడి గ్రామోత్సవం పాల్గొన్న గ్రామస్తులు, రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రబోధానంద సేవా సమితి సభ్యులు. శ్రీకృష్ణాష్టమి రోజున ప్రత్యేక పూజలు చేసిన అనంతరం శ్రీకృష్ణుడి ప్రతిమను ప్రతిష్ఠించి, 11 రోజులు పూజలు నిర్వహించడంతో పాటు గ్రామోత్సవం నిర్వహించడం 11 సంవత్సరాలుగా నిర్విఘ్నంగా కొనసాగుతోందన్న కాపా శ్రీనివాసరావు.శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల వారు రచించిన గ్రంథాల్లోని శ్రీకృష్ణుల వారి దివ్యమైన భావాలను, భగవద్గీత సారాంశాన్ని 11 రోజులుగా ప్రజలకు వివరించడం జరిగిందన్న కాపా శ్రీనివాసరావు. ప్రాచీన కాలంలో శ్రీకృష్ణ జన్మాష్టమిని 11 రోజులు అత్యంత భక్తి, శ్రద్ధలతో అందరూ జరుపుకునే వారని, కాలక్రమేణా ఈరోజు కొన్ని ప్రాంతాలకు, కొన్ని వర్గాలకు పరిమితం అయ్యిందన్న కాపా శ్రీనివాసరావు. శ్రీకృష్ణుడి చల్లని దీవెనలతో ప్రజలందరికీ, ఆయన ప్రసాదించిన జ్ఞానాన్ని అందించడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపిన కాపా శ్రీనివాసరావు. రావిచర్ల గ్రామంలో ఈ నెల 4వ తేదీ నుండి శ్రీకృష్ణాష్టమి వేడుకలను నిర్వహిస్తున్నామని, గ్రామోత్సవంలో కుల, మతాలకు అతీతంగా ప్రజలందరూ పాల్గొనడం జరిగిందన్న ప్రబోదానంద సేవా సమితి సభ్యులు కొల్లి వెంకటమల్లేశ్వరరావు. శ్రీకృష్ణ పరమాత్ముడు సర్వ ప్రపంచానికి ఒకే దేవుడని, విశ్వవ్యాప్తంగా ఉన్న రూప, నామ, క్రియ లేని పరమాత్మ దైవాంశ మానవుడిగా పుట్టి మనకు దైవజ్ఞానాన్ని తెలిపారన్న వెంకటమల్లేశ్వరరావు. ఆ దైవజ్ఞానంలో ధర్మాలను తెలుసుకుని, ఆచరించి, ముక్తి మార్గంలో ప్రయాణించి, పరమాత్మలో ఐక్యం కావడమే ప్రధానమని ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల వారు తెలియజేశారన్న వెంకటమల్లేశ్వరరావు. భగవత్ జ్ఞానాన్ని ప్రతిఒక్కరూ తెలుసుకుని, ముక్తి మార్గంలో పయనించాలన్న వెంకటమల్లేశ్వరరావు.

## ఘనంగా ఇన్చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు జన్మదిన వేడుకలు....



**పెనుగంచిప్రోలు,సెప్టెంబర్ 15 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు గ్రామ పార్టీ అధ్యక్షులు గుడిమెట్ల శంకర్ ఆధ్వర్యంలో తన్నీరు నాగేశ్వరరావు జన్మదిన వేడుకలు మంగళవారం వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మాజీ మండల పార్టీ అధ్యక్షులు వూట్ల నాగేశ్వరరావు రాష్ట్ర బీసీ ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు లు కేక్ కట్ చేసి కార్యకర్తల కు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ చేని కుమారి ,జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి చేని రాంబాబు ,జిల్లా లీగల్ సెల్ మెంబెర్ బత్తుల నవీన్ కుమార్ మాజీ నీటి సంఘం అధ్యక్షులు చుంచు బెనర్జీ ,నియోజకవం- వాణిజ్య విభాగం అధ్యక్షులు దేరంగులశ్రీనివాసరావు ,మండల ప్రధాన కార్యదర్శి తమ్మిశెట్టి సోమయ్య , మండల యూత్ అధ్యక్షులు కోయ బాబి ,సినియర్ నాయకులు బిందాన నాగేశ్వరరావు సినియర్ నాయకులు బోల్లేపల్లి వీరయ్య ,గ్రామ యూత్ అధ్యక్షులు మల్లెబోయిన సైదులు, గ్రామ ప్రధాన కార్యదర్శి బొజ్జ సాయిరాం , చెక్క రమణ,చెన్న గోపి షైక్ బోసు తూము గోపి దినేష్ దార గౌతమ్ తదితరులు పాల్గొన్ని తన్నీరు నాగేశ్వర రావు పుట్టినరోజు వేడుకలు జరిపారు..

## స్థానిక నిరుద్యోగ యువతకు పారమౌంట్ సంస్థలో ఉద్యోగ అవకాశాలు..

-- మాజీ ఎమ్మెల్సీ టీ.డి. జనార్ధన్....



**పెనుగంచిప్రోలు,సెప్టెంబర్ 15 (వార్తాప్రభ) :** జగ్గయ్యపేట నియోజకవర్గం లోని పెనుగంచిప్రోలు మండల పరిధిలోని కొనకంచి క్రాస్ రోడ్ పారమౌంట్ సంస్థలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలియజేశారు. ఇటీవల జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉద్యోగ మేళా నందు 30 మంది స్థానిక యువతకు నేరుగా ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు జయప్రద ఫౌండేషన్ అధినేత టీడీ జనార్ధన్ పేర్కొన్నారు. స్థానికంగా పదవ తరగతి,ఐటిఐ,డిప్లమా పూర్తిచేసిన నిరుద్యోగులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన తెలియజేశారు.పారామౌంట్ సంస్థ అధినేత వెనిగళ్ళ సురేష్ కుమార్, మేనేజింగ్ డైరెక్టర్ ప్రీతంబాబు ఆదేశాల మేరకు జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గ గ్రామీణ ప్రాంత యువతకు తమ సంస్థలో ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నట్లు ప్రతినిధులు పోటు అయ్యన్న, జానీ తెలియజేశారు. ఐటిఐ, డిప్లమా పూర్తి చేసిన నిరుద్యోగులకు శిక్షణతో కూడిన ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు వారు తెలిపారు. నందిగామ జగ్గయ్యపేట నియోజకవర్గ నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశాల కొరకు 9010009111 నంబర్ ను నేరుగా సంప్రదించవచ్చని సంస్థ ప్రతినిధులు తెలియజేశారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188